
బీసీ సభ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

3

మంగళవారం 5 మార్చి 2024



నేడు జయహో బీసీ సభ

- ఏఎన్‌యూ ఎదుట సభా ప్రాంగణం
- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్
- జాతీయస్థాయిలో బీసీల డిక్లరేషన్ విడుదల చేయనున్న నేతలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన టీడీపీ రాష్ట్ర నేతలు

పెదకాకాని, మార్చి 4: తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలు తలపెట్టిన జయహో బీసీ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. గుంటూరు విజయవాడ మధ్య ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల సువిశాల ప్రాంగణంలో సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇరు పార్టీలకు చెందిన బీసీలు సుమారు మూడు లక్షల మందికి పైగా తరలివస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. విశ్వవిద్యాలయ ఎదురుగల ప్రాంగణంలో సభా వేదికను భారీగా నిర్మించారు. టీడీపీ అధినేత చంద్ర బాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ఈ సభలో పాల్గొననున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ మోహన్ రెడ్డి బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని వివరిస్తూ జాతీయస్థాయిలో బీసీలకు ప్రయోజనం చేకూరేలా బీసీ డిక్లరేషన్ ప్రకటించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే విధి విధానాలు తయారుచేసినట్లు ఆ పార్టీ నాయకులు అచ్చెన్నాయుడు, రవీంద్రలు తెలిపారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు పెద్దఎత్తున టీడీపీ, జనసేన బీసీ శ్రేణులు తరలివస్తారని భావిస్తున్న నాయ కులు భారీ ఏర్పాట్లను చేపట్టారు. సభా ప్రాంగణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అనగాని, సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి రవీంద్ర



ఏర్పాట్లను పర్యవేక్షించిన నాయకులు


బీసీ బహిరంగ సభ ఏర్పాట్లను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, మాజీమంత్రి కొల్లు రవీంద్ర, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు పర్యవేక్షించారు. సభా ప్రాంగణాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సభ ప్రాంగణానికి ఎదురుగా ఎల్‌ఈడీ టీవీలను ఏర్పాటు చేస్తున్నారు.

జగన్ బీసీలకు తీరని ద్రోహం చేశారు.. మాజీ మంత్రి అచ్చెన్నాయుడు

జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత బీసీలకు తీరని ద్రోహం చేశారని మాజీ మంత్రి, టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. సోమవారం జయహో బీసీ సభ ఏర్పాట్ల పర్యవేక్షణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులు, దారుణాలు అన్నీ ఇన్నీ కాదన్నారు. బీసీల పట్ల ముఖ్యమంత్రి జగన్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో ఎందరో బీసీలను పొట్టన పెట్టుకున్న ఘనత జగన్‌దే అని అన్నారు. రాష్ట్రవ్యాప్తం గా వందలాది మంది బీసీలను హతమార్చిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. తెలుగుదేశం హయాంలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను జగన్ పక్కన పడేశారన్నారు. బీసీలను అన్నివిధాల మోసం చేసిన జగన్‌కు బీసీలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు.

బీసీల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి: మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

రాష్ట్రంలో అబద్ధాలు, తప్పుడు మేనిఫెస్టో పెట్టి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ బీసీల ద్రోహిగా మారారని మాజీమంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం జయహో బీసీ ప్రాంగణం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. జయహో బీసీ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు పాల్గొంటారని, వారు ఉమ్మడిగా జాతీయ స్థాయిలో బీసీల డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో బీసీలు అన్ని రంగాల్లో అణగ దొక్కబడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 75వేల కోట్ల రూపాయల బీసీల కార్పొరేషన్ రుణాలను ఎత్తివేసిన ఘనుడు జగనన్నారు. బీసీల మధ్య ఐక్యత లేకుండా చేస్తూ కార్పొరేషన్లుగా విభజించారని, కేవలం పదవులు మాత్రమే ఇచ్చారు కానీ ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదని అన్నారు. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే బీసీలు మిగిలిపోయారని తెలిపారు. రాష్ట్రంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు, తెలుగుదేశం పార్టీలో బీసీలకు జరిగిన ప్రయోజనాలను వివరిస్తూ జాతీయస్థాయిలో బీసీ డిక్లరే షన్‌ను ప్రకటిస్తారని తెలిపారు.



- వైసీపీలో సమన్వయకర్తలకు సీటు విషయంలో దక్కని భరోసా
- ఇన్‌చార్జిలుగా నియామకమే తప్ప ఫైనల్ కాదంటున్న అధిష్ఠానం
- తాజాగా పార్టీ చేపట్టిన మార్పులతో కొరవడిన ధీమా
- అయోమయంలో వైసీపీ.. కాడి వదిలేస్తున్న ఇన్‌చార్జిలు

నెలల తరబడి సర్వేలు చేయించాం.. ప్రజల్లో అభిప్రాయ సేకరణ జరిపాం.. పరిస్థితులేవీ అనుకూలంగా లేనందున మరొకరికి సమన్వయకర్తగా అవకాశమిస్తున్నాం.. సహకరించాలి.. ఆయా నియోజక వర్గాల్లో ఇన్‌చార్జిల మార్పు ప్రక్రియ చేపట్టే సందర్భంలో పార్టీ పెద్దలు గతంలో చెప్పిన మాటలివి. అప్పటి నుంచి అసమ్మతి స్వరాలు, అలకలు, రాజీనామాలు పాలకపార్టీలో కొన సాగుతూనే ఉన్నాయి. ఈ అసమ్మతి జ్వాలలు చల్లారకముందే కొత్తగా నియమించిన వారి విషయంలో గ్యారెంటీ లేదనే లీకులను వైసీపీ ఇస్తోంది. వారిని ఆయా నియోజక వర్గాల్లో సమన్వయకర్తలుగా నియమించాం తప్పితే అదే ఫైనల్ కాదనే పొంతనలేని ప్రకటనలను వైసీపీ పెద్దలు చేస్తున్నారు. కొత్త ఇన్‌చార్జిలను నియమించిన చోట మళ్లీ మార్పులు చేపడుతుండడంతో ఇక్కడ నేతలకు ధీమా కరువైంది. ఇది వైసీపీలోని అయోమయ స్థితికి అద్దం పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తాజా మార్పులతో మరింత బెంబేలు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి, పొన్నూరుతో పాటు గుంటూరు పార్లమెంట్ విషయంలో పార్టీ వేసిన పిల్లిమొగ్గలు ఇన్‌చార్జిలను మరింత గందరగోళంలో పడేశాయి. మంగళగిరి విషయంలో ఒకటికి రెండుసార్లు మాట మార్చడం ఒక ఎత్తయితే గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి విషయంలో వైసీపీ చేపట్టిన మార్పులను చూసేసరికి తమ పరిస్థితి కూడా ఇంతేనన్న నైరాశ్యంలో సదరు నేతలు మునిగిపోయారు.

బాపట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీలో ఇన్‌చార్జిల మార్పు ఓ ప్రహసనంగా మారింది. ఇన్‌చార్జిల మార్పు చేపట్టిన బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏ ఒక్క చోటా కొత్తపాత నాయకులు ఏకతాటి మీద నడవడం లేదు. పైగా ద్వితీయశ్రేణి నాయకులు ఇప్పటికీ నిత్యం తాడేపల్లి గడప ఎక్కుతూ కొత్త ఇన్‌చార్జిలపై తమ అసంతృప్తిని వెలిబుచ్చుతూనే ఉన్నారు. వీరికి తెర వెనక మాజీ నాయకుల సహకారం ఉండడం గమనార్హం. రేపల్లెలో వైసీపీ నియమించిన ఈవూరు గణేష్‌కు నేటికీ పార్టీ శ్రేణుల నుంచి కనీసస్థాయిలో కూడా సహకారం దక్కకపోవడం వైసీపీలోని గందరగోళ స్థితికి ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మళ్లీ సర్వేల పరంపర..

ఇన్‌చార్జిల మార్పు నిర్ణయం చేపట్టేటప్పుడు వీళ్లే ఆయా సీట్లకు తుది ఎంపిక అవుతారనే విధంగా వైసీపీ కలరింగ్ ఇచ్చింది. సీన్ కట్ చేస్తే తనకు అలవాటైన రీతిలో తూచ్ అనేస్తూ నాలుక మడతేసింది. మళ్లీ సర్వేలు చేపడుతున్నామని, నియోజకవర్గాల్లో శ్రేణులనుంచి అభిప్రాయాన్ని తాజాగా సేకరిస్తున్నామని ఆ తర్వాతే ఫైనల్‌గా అభ్యర్థి ఖరారు ఉం టుందని తాజాగా వైసీపీ సెలవిస్తుండడంతో అవాక్కవడం సదరు నేతల వంతవుతోంది. దీంతో అట్టహాసంగా ఆయా నియోజకవర్గాల్లోకి రంగ ప్రవేశం చేసిన సమన్వయకర్తలు పార్టీ చేస్తున్న పొంతనలేని ప్రకటనలతో తలలు పట్టుకుంటున్నారు.

ఏ ప్రకటనా వెలువడని వారిది మరో వ్యథ..

నియోజకవర్గాల్లో కొత్తగా సమన్వయకర్తలుగా వచ్చిన వారి సీటు ఖరారు విషయంలో ఓ తంతు నడుస్తుంటే, పాలకపార్టీలో ఇప్పటికే ఎమ్మెల్యేలుగా కొనసాగుతూ అధికారికంగా ఎటువంటి ప్రకటన రాని వారిది మరో వ్యథ. రోజుకో సర్వే పూటకో అభ్యర్థి పేరుతో వారి గుండెల్లో కూడా వైసీపీ రైళ్లు పరిగెత్తిస్తోంది. మొత్తంగా చూస్తే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఈ సీటు తనదే అని నమ్మకంగా చెప్పగలిగే సాహసాన్ని వైసీపీ అభ్యర్థులు చేయలేకపోవడం పార్టీలో కొనసాగుతున్న అయోమయ స్థితికి నిదర్శనంగా చెప్పవచ్చు.

అభ్యర్థుల కోసం పక్కచూపులు..

గెలుపు విషయంలో ధీమా సంగతి దేవుడెరుగు కనీసం సమర్థులైన అభ్యర్థులు దొరక్క రోజుకో ప్రకటనతో కాలం వెళ్లదీయాల్సిన దీనస్థితిని వైసీపీ ఎదుర్కొంటుందని టీడీపీ ఆరోపిస్తోంది. ఇన్నాళ్లు బీరాలు పలికిన పాలక పార్టీ ఎన్నికలు దగ్గర పడే కొద్దీ సొంత నేతల మీ ద నమ్మకం లేక తమ పార్టీ నేతలకు వలవేసే పనిలో నిమగ్నమైందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. మునిగిపోయే నావలోకి వెళ్లడానికి ఎవరూ సుముఖంగా లేకపోవడంతో కింకర్తవ్యం ఏమిటో తెలియక అభ్యర్థిత్వాల విషయంలో సర్వేల పేరిట వైసీపీ కాలయాపన చేస్తోందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

ప్రకటించాక చూసుకుందాంలే..

ఇన్‌చార్జిల మార్పు విషయంలో వైసీపీ వేస్తున్న చిందులను చూసి అధికారికంగా తమ పేరు ప్రకటించాక ఆలోచిద్దాంలే అన్న ధోరణికి సదరు నేతలు వచ్చినట్లు తెలుస్తోంది. వైసీపీకి చెందిన ఓ కార్యకర్త తన సమస్యను చెప్పుకుందామని ఇటీవల మార్పు చేపట్టిన బాపట్ల జిల్లాలోని ఓ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వద్దకు వెళ్లగా తనకే సీటు విష యంలో గ్యారెంటీ లేదని తాను నీకేమీ చేయగలనని చేతులెత్తేయడంతో బిత్తరపోవడం ఆ కార్యకర్త వంతైంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జిలుగా చలామణి అవుతున్న నేతల తీరు ఇలానే ఉంటుంది. సీటు విషయంలో సరైన భరోసా దక్కకపోగా రోజుకో పేరు తెరమీదకు వస్తుండడం వారిని మరింత గందరగోళం లోకి నెట్టడంతో పాటు పార్టీలో పరిస్థితి అయో మయంగా ఉందనే వ్యాఖ్యానాలను సదరు నేతలే చేయడం గమనార్హం. మరో వైపు టీడీపీ మాత్రం విస్పష్ట ప్రకటనతో ఆయా నియోజకవర్గాలకు పోటీ పడే అభ్య ర్థుల పేర్ల ను వెల్లడించడంతో వైసీపీ పని మరింత దిగ జారిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సమైక్యంగా.. ముందడుగు

- రాక్షస పాలన అంతం కోసం..
- తెలుగుదేశం, జనసేన కూటమి గద్దెనెక్కటమే మన లక్ష్యం
- గ్రామస్థాయిలో కలసి పనిచేద్దాం..
- తెనాలిలో జనసేన సమన్వయ కర్తలతో పెమ్మసాని, మనోహర్
- ఆత్మీయ పలకరింపుతో ఇరు పార్టీల మధ్య స్నేహబంధం



7 నియోజకవర్గాల జనసేన సమన్వయకర్తలతో సమావేశమైన గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి చంద్రశేఖర్, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న రాక్షసపాలన అంతమొందించి, సైకోను మించిన జగన్‌ను ఇంటికి పంపటానికి తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు సమైక్యంగా ముందడుగు వెయ్యాలని గుంటూరు పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి, ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌లు పిలుపునిచ్చారు. దీనికి ఓటరును కూడా చైతన్యం పరచాల్సిన బాధ్యతకూడా గ్రామస్థాయిలో ప్రతి ఒక్క కార్యకర్త తీసుకోవాలని అన్నారు. జనసేన సమన్వయకర్తల ఆత్మీయ సమావేశంలో భాగంగా తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల జనసేన నాయకులు, సమన్వయ కర్తలతో చంద్రశేఖర్, మనోహర్‌లు సమావేశమయ్యారు. చంద్రశేఖర్‌కు జనసేన సమన్వయకర్తలను మనోహర్ పరిచయం చేశారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకోవటంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు అందరిలో ఆలోచన తీసుకొచ్చాయని అన్నారు. ఈ తరుణంలో ఓటు చీలటం ప్రమాదమనే భావనతోనే తెలుగుదేశం, జనసేన కలసి పోటీచేయాలని రెండు పార్టీల అధినేతలు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయం కేవలం మన భావితరాల భవిష్యత్ కోసమేనన్నారు. అయితే ఇరు పార్టీల కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసేలా, ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు వరుస సమావేశాలుపెడుతున్నట్టు చెప్పారు. తెనాలి నియోజకవర్గ తొలి సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. తర్వాత మండల స్థాయి, గ్రామస్థాయి నేతలతోకూడా సమావేశమవుతామన్నారు. ఇరు పార్టీలకు ఓట్ల బదిలీ సక్రమంగా జరిగే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కార్యకర్తలు, నాయకులు అంతా కలసికట్టుగా ఎన్నికలకు సిద్ధమయ్యేలా చైతన్యం తీసుకొస్తున్నట్టు పేర్కొన్నారు. ఇదే అంశాలను కార్యకర్తలు, నాయకులతో కూడా చర్చించి, వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రం మొత్తంలో తెలుగుదేశం, జనసేన మధ్య కొనసాగుతుందని, దీనికి జనసైనికులు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వడ్రాణం మార్కండేయబాబు, తాడికొండ నుంచి బేతపూడి విజయశేఖర్, గుంటూరు-1 నుంచి నేరెళ్ల సురేష్, ప్రత్తిపాడు నుంచి కొర్రపాటి నాగేశ్వరరావు ఇతర పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మిర్చి ధర... పతనం

- గత వారంలో తేజా రకం క్వింటాలు రూ.21 వేలు
- ఈ వారం రూ.16 వేలే
- యార్డుకు వచ్చి గుల్ల అయ్యామంటున్న రైతులు
- ఆత్మహత్యలే శరణ్యమంటూ కన్నీళ్లు

గుంటూరు సిటీ, మార్చి 4: మిర్చి ధర భారీగా పతనమైంది. గత వారంతో పోలిస్తే ధరలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. వారం వ్యవధిలోనే క్వింటాలుకు రూ.5000 నుంచి రూ.7000 వరకు ధర తగ్గిపోయింది. గుంటూరు మిర్చి యార్డులో సోమవారం తేజా రకం రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. మిగిలిన రకాల ధరలు ఇంకా పూర్తిగా తగ్గిపోయాయి. సార్కో రకం రూ.11 వేల నుంచి రూ.14 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. గత వారంలో ఇదే రకం రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు పలికింది. మొత్తం మీద అన్ని రకాల మిర్చి ధర బాగా తగ్గించి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. సుమారు 5 లక్షల టిక్కీలు ఒకేసారి రావటంతో ధరను పూర్తిగా తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. యార్డుకు తీసుకొస్తే రూపాయి ఎక్కువ వస్తుంది అనుకున్న రైతుల ఆశలు పూర్తిగా ఆవిరవుతున్నాయి. స్థానికంగానే ఎక్కువ ధరకు అడుగుతుండగా యార్డులోని వ్యాపారులు ధరను పాతాళానికి పడేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మిర్చి ధరలతో రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి ఉంది. కొందరు రైతులు ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులను కదిలిస్తే కన్నీరు మున్నీరవుతున్నారు.



విద్యాశాఖలో.. వసూల్‌రాజా

- లెసన్ ప్లాన్ లేదని ఉపాధ్యాయులకు రూ.20వేలు ఫైన్
- ఎయిడెడ్ గ్రాంట్, గుర్తింపు కోసం రూ.40వేలు...
- కారుడ్రైవర్.. అటెండర్‌కు ముడుపులు ఇవ్వాల్సిందే
- విద్యాశాఖలో ద్వితీయ శ్రేణి అధికారి వసూళ్ళపర్వం
- ముఖ్య కార్యదర్శి ఆదేశించినా క్రమశిక్షణా చర్యలు నిల్
- హెచ్‌ఎంతో ఆర్జేడీ రహస్య విచారణ
- సెలవులో అధికారి

గుంటూరు(విద్య), మార్చి 4: విద్యాశాఖలో ఆయన్ ద్వితీయశ్రేణి అధికారి, క్రమశిక్షణకు మారుపేరులా కనిపిస్తారు.. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంలా బిల్డప్ ఇస్తారు.. కానీ పాఠశాలల్లో తనిఖీలకు వెళ్ళినప్పుడు నాణేనికి మరోవైపు ఉన్న స్వరూపం బహిర్గతమౌతుంది. ఆయన తనిఖీలకు వస్తున్నాడంటే ప్రభుత్వ ఉపాధ్యాయులైనా ప్రైవేటు యాజమాన్యాలైనా కాసులు సిద్ధం చేసుకోవాల్సిందే. అంతేకాదు ఉదయం వెళితే పెద్ద హోటల్ నుంచి టిఫిన్లు, మధ్యాహ్నం అయితే బిర్యానీతోపాటు చికెన్, మటన్, తలకాయ కూర వంటి రకరకాల ప్రత్యేక మెనూ పాఠశాల యాజమాన్యాలు తెప్పించాల్సిందే. దీనికితోడు తనిఖీల తరువాత ఆయనతోపాటు కారుడ్రైవర్, అటెండర్‌కు భారీమొత్తంలో కవర్‌లో పెట్టి ముట్టచెప్పాలి. మరో వైపు పాఠశాలలో ఎవరైనా మహిళా టీచర్లు కనిపిస్తే చాలు ఎగాదిగా చూడడం, వారితో వెటకారంగా మాట్లాడడం చేస్తాడు. చిన్న చిన్న తప్పుల్ని ఎత్తి చూపడం.. మెమోలు ఇస్తానని ఉపాధ్యాయుల్ని బెదిరిస్తాడు. తరువాత భారీమొత్తంలో ఫైన్స్ వేస్తాడు. గుర్తింపుకోసం వచ్చే ప్రైవేటుస్కూల్స్ నుంచి భారీస్థాయిలో డబ్బులు గుంజడం ఆయన నైజం. గత ఏడాది జిల్లాకు వచ్చిన విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఈ అధికారి పనితీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. క్రమశిక్షణాచర్యలకు ఆదేశాలు ఇచ్చినా విద్యాశాఖలో బుట్టదాఖలు అయ్యాయి.

- ఇటీవల నగరంలోని ఓ మున్సిపల్ స్కూల్‌కు సదరు అధికారి తనిఖీకి వెళ్ళారు. అక్కడి ఉపాధ్యాయులు లెసన్‌ప్లాన్ తయారుచేయడంలో కొద్దిగా తప్పులు చేశారు. దీంతో అగ్గిమీద గుగ్గిలం అయిన సదరు అధికారి ఫైన్ పేరుతో ఒక్కో ఉపాధ్యాయుడి నుంచి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.20 వేలు వసూలుచేయించి జేబులో వేసుకున్నారు. ఆయనతోపాటు వచ్చిన కారుడ్రైవర్, అటెండర్‌కు ఉపాధ్యాయుల చేత ఫోన్‌పే ద్వారా ఒక్కొక్కరికి రూ.2వేలు చెల్లించేలా ఏర్పాట్లు చేశారు.
- నగరంలోని ఓ మతానికి చెందిన విద్యాసంస్థకు ప్రభుత్వ ఎయిడ్, గుర్తింపు ఇచ్చేందుకు ఈ అధికారి రూ.75వేలు డిమాండ్ చేశాడు. మీరు ప్రభుత్వం నుంచి నిధులు ఎలా పొందుతారో నాకు తెలుసు అంటూ నిర్వాహకుల్ని బెదిరించారు. చివరకు రూ.40వేలు అప్పటికప్పుడు చెల్లించిన తరువాత గుర్తింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.
- నగరం నడిబొడ్డున ఉన్న ఓ ఎయిడెడ్ పాఠశాలలో తనిఖీ కోసం వెళ్ళి అక్కడ మహిళా ఉపాధ్యాయురాలి పట్ల ఈ అధికారి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు ఉపాధ్యాయురాలు ఘాటుగా హెచ్చరించడంతో అధికారి వెనక్కు తగ్గారు.
- పొన్నెకల్లు సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు తనిఖీ కోసం వెళ్ళి అక్కడ యాజమాన్యం పసందైన విందు తరువాత కొంత నగదు ఇచ్చారు. డబ్బుల్ని సదరు అధికారి అక్కడే లెక్కించారు. ఇచ్చింది సరిపోకపోవడంతో అదనంగా మరికొంత వసూళ్ళు చేశారు.
- తూర్పు నియోజక వర్గ పరిధిలోని ఓ ప్రభుత్వ స్కూల్‌కు తనిఖీ కోసం వెళ్ళి చిన్న లోపం చూపి అక్కడ హెచ్‌ఎం నుంచి రూ.10వేలు గుంజాడు. ఇలా నిత్యం తనిఖీల పేరుతో ఆయన పాఠశాలల్లో చేస్తున్న వసూళ్ళపర్వాన్ని, విందు, వినోదాల్ని ఉపాధ్యాయులు చెప్పుకొని అసహ్యించుకుంటున్నా సదరు అధికారిలో మార్పు రావడం లేదు. రోజు సగటున నాలుగైదు స్కూల్స్ తనిఖీ చేస్తాడు. ఒక్కో స్కూల్ నుంచి సగటున రూ.10వేలు చొప్పున మొత్తం రూ.50వేలు పైనే జేబులో వేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే సదరు అధికారి వసూళ్ళ పర్వం గురించి పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శికి, డైరెక్టర్ స్థాయిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే ఇటీవల కొత్తగా బాధ్యతుల చేపట్టిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి కొన్ని పాఠశాలల హెచ్‌ఎంలను కార్యాలయానికి పిలిచి రహస్యంగా విచారణ చేపడుతున్నారు. దీంతో సదరు అధికారి సెలవులో వెళ్ళినట్లు సమాచారం.



రసవత్తరంగా గుంటూరు పశ్చిమ రాజకీయం

- తెరపైకి మాజీ మంత్రి ఆలపాటి రాజా
- టీడీపీ ఐవీఆర్‌ఎస్ సర్వేతో కొత్త పరిణామాలు
- ఇప్పటికే మంత్రి రజినిని రంగంలోకి దించిన అధికార పార్టీ
- ఆమెను ధీటుగా ఎదుర్కొనే అభ్యర్థి కోసం పార్టీ కసరత్తు

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు 'పశ్చిమ' నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోట. అలాంటిచోట టీడీపీ రాజకీయం రసవత్తరంగా మారింది. ఆ నియోజకవర్గంలో రాష్ట్ర ఆరోగ్యమంత్రి, బీసీ మహిళ అయిన విడుదల రజినీని అధికార వైసీపీ రంగంలోకి దించడంతో మొత్తం రాజకీయ సమీకరణాలన్నీ ఒక్కసారిగా మారిపోయాయి. ప్రస్తుతం ఇన్‌చార్జిగా వున్న కోవెలమూడి రవీంద్ర (నాని) స్థానే బలమైన బీసీ అభ్యర్థి కోసం పార్టీ కసరత్తు చేస్తున్నట్లుగా కనిపించింది. అయితే సోమవారం ఉన్నట్టుండి ఒక్కసారిగా పశ్చిమ టీడీపీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేరు తెరమీదకు వచ్చింది.

రాజా పేరే ఎందుకు?

ఉన్నట్టుండి 'పశ్చిమ' తెరపైకి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేరు వినిపించడానికి బలమైన కారణాలే వున్నట్లు తెలుస్తోంది. విడదల రజనీని ఎదుర్కోవడానికి సామాజికవర్గం ప్రాతిపాదిక మాత్రమే సరిపోదని, రాజకీయంగా, ఆర్థికంగా అన్నివిధాలుగా ఎదుర్కొనగలిగే బలమైన అభ్యర్థి అయితేనే మంచిదని అధిష్ఠానంతోపాటు, టీడీపీ శ్రేణులు కూడా కోరుకుంటున్నాయి. గుంటూరు తెలుగు యువత అధ్యక్షునిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం వున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అయితేనే రజనిని అన్ని రకాలుగా ధీటుగా ఎదుర్కోగలడన్న భావన అధిష్ఠానంతోపాటు స్థానిక నాయకత్వంలో కూడా కనిపిస్తోంది. గత కొంతకాలంగా ఇదే అంశంపై పార్టీలోని పెద్దలు కసరత్తు చేశారు. ఈ క్రమంలోనే సోమవారం నిర్వహించిన ఐవీఆర్‌ఎస్ సర్వేలో ఆలపాటి రాజా పేరు ప్రముఖంగా వినిపించింది.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీకృష్ణ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వామి దర్శనం జరగాలి

అమృతలూరు, మార్చి 4: అధికారులు సమన్వయంతో పనిచేయాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో ద్వితీయ కో ఆర్డినేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ మాట్లాడారు. ఆయా శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఆయా శాఖలు చేపట్టిన పనులను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయ పరిసరాల్లో, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. 200మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. ట్రాఫిక్‌కు ఏలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పండుగ ప్రత్యేక అధికారి అమర్‌నాథ్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామివారిని సుమారు రెండు లక్షలమంది భక్తులు దర్శనం చేసుకుంటారన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ అధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు, అదనపు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోమల తెలిపారు. వైద్యాధికారి ఏసుబాబు మాట్లాడుతూ ఆలయ ప్రాంగంణంలో, వెలుపల రెండు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. శిబిరాల్లో 24 గంటలు వైద్యులు, 104, 108 వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యుత్ శాఖ ఏఈ నాంచారయ్య మాట్లాడుతూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఆలపాటి రమాదేవి, ఈవో అశోక్‌రెడ్డి, సర్పంచ్ మండవ విజయలక్ష్మీ, డీఎల్‌పీవో తాతా శివశంకరరావు, తహసీల్దార్ కవిత, చుండూరు సీఐ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీ

స్పష్టమైన వైఖరితో ఉంది

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

నరసరావుపేట టౌన్, మార్చి 4 :రాజధాని విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయకక్షలతో వ్యవహరించిన తీరు, రాజధాని లేకపోవటం వలన రాష్ట్రం నష్టపోయిన విధానంపై కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన వైఖరితో ఉందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పునర్‌వ్యవస్థీకరణ చట్టాన్ని 10 సంవత్సరాలుగా బీజేపీ అమలు చేయకపోవటం, అమలు చేయమని పోరాడలేని వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు ఉండటం వలన ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించిందన్నారు. ఇప్పుడు దుస్థితిలో ప్రత్యేక హోదా పది సంవత్సరాలు ఇస్తేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందనే లక్ష్యాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి నెలకు రూ.5వేలు, ఏడాదికి రూ.60 వేలు, ఐదు సంవత్సరాలకు రూ.3 లక్షలు సాయం చేయాలనే గ్యారెంటీని కాంగ్రెస్ ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి వచ్చే రాజకీయ మిత్రులు ఇండియా కూటమి రాష్ట్రానికి భవిష్యత్ చూపగలదని అన్నారు. సమావేశంలో ఏపీసీసీ వైస్‌ప్రెసిడెంట్ కొరివి వినయ్ కుమార్, కాంగ్రెస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీ అలెగ్జాండర్ సుధాకర్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు సత్వర న్యాయం చేకూర్చాలి

● కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాదం కారణాలను వెల్లడించాలి
● 700 మంది రైతులకు రూ.100 కోట్ల మేర నష్టం
● కలెక్టర్‌కు నాదెండ్ల మనోహర్ వినతి పత్రం అందజేత
● నివేదికను సీఎం కార్యాలయానికి పంపుతాం : కలెక్టర్


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాదెండ్ల, టీడీపీ-జనసేన నాయకులు

గుంటూరు(తూర్పు), మార్చి4: దుగ్గిరాల కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం జరిగి దాదాపు 45 రోజులు గడుస్తున్నా, అధికారులు మాత్రం ఇంతవరకు ప్రమాద కారణాలు వెల్లడించలేకపోవడం బాధాకరమని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, తెనాలి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆప్రాంత రైతులు, జనసేన, టీడీపీ నేతలతో కలిసి సోమవారం స్పందనలో గుంటూరుజిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ దాదాపు 700మంది పసుపు రైతులకు రూ.100 కోట్లు మేర నష్టం వాటిల్లిందని, కానీ అధికారులు మాత్రం రూ.40 కోట్లుకు బీమా ఉందని చెబుతున్నారని, దీంతో రైతులలో ఆందోళన నెలకొందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.13 వేల వరకు ఉందని, కానీ క్వింటాకు రూ.4వేలుచొప్పున లెక్కకట్టడానికి అధికారులు చూస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే రైతులను ఆదుకోవాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఉన్నతాధికారులకు లేఖ రాసారని దీనిపై స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ వేగంగా పూర్తి చేసి బీమా సంస్థ నిధులు ఆలస్యమైతే ధరల స్థిరకరణ నిధి, విపత్తు నిధులనుంచి పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే వినతిపత్రంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, మంగళవారం సాయంత్రం లోపు నివేదికను తీసుకుని, వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతామని హామీ ఇచ్చినట్టు నాదెండ్ల తెలిపారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పందన రాకపోతే భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గాదె వెంకటేశ్వర్లు, నేరళ్ల సురేష్, గంధం సురేష్, ఆళ్ల హరి, రైతు సంఘ నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, ఆ ప్రాంత రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీమా అధికారికి రైతు సంఘాల నాయకుల వినతి

గుంటూరు(తూర్పు) : దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు న్యాయం చేయాలని సోమవారం గుంటూరు కొరిటిపాడులోని న్యూఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ డిప్యూటీ మేనేజర్ పీ. నాగచంద్రికకు రైతు సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. నాగచంద్రిక స్పందిస్తూ.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు కేవీవీ ప్రసాదు, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి...

గుంటూరు : బీసీ వర్గాల అభ్యున్నతి కోసం మంగళగిరిలో మంగళవారం నిర్వహించే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని నాదెండ్ల మనోహర్ పార్టీ వర్గాలకు పిలుపునిచ్చారు. సోమవారం జనసేనపార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసభలో పాల్గొంటారన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ, జనసేన కలసి పని చేస్తాయని ఆయన తెలిపారు. సమావేశంలో బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వర్లు, నేరెళ్ల సురేష్, చిల్లపల్లి శ్రీనివాస్, కొర్రపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

620 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి, మార్చి 4: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని సోమవారం మంగళగిరి మండలం కాజా టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు టోల్‌ప్లాజా వద్ద నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం తరలిస్తున్న ఏపీ16టీజే5236 నెంబరు గల లారీని అడ్డుకొని 620 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.11.78లక్షలు వుంటుందని మంగళగిరి డిప్యూటీ తహసీల్దారు దుర్గారావు తెలిపారు. బియ్యం బస్తాలను నూజివీడు నుంచి నెల్లూరు జిల్లాకు తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. లారీని, డ్రైవరును అదుపులోకి తీసుకుని మంగళగిరి రూరల్‌పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ ఆళ్ల శ్రీహరి, వీఆర్వో రామారావు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక

మంగళగిరిసిటీ, మార్చి 4: గుంటూరు జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు మంగళగిరి ఫిట్‌జోన్ జిమ్‌లో జరిగాయి. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని సోమవారం వెల్లడించారు. పురుషుల జట్టుకు హెచ్.రమేష్‌శర్మ(గుంటూరు), వై.హర్షవర్ధన్ (తెనాలి), ఎల్.దినేష్(గుంటూరు), ఎస్‌కే అష్రాఫ్ అలీ (గుంటూరు), రామ్‌కుమార్(మంగళగిరి), కౌశిక్(తెనాలి), రాజాదత్తు (గుంటూరు), వీ.దేవేందర్‌రెడ్డి (తెనాలి), ఎం.అభిషేక్ (గుంటూరు) ఎంపికయ్యారు. మహిళల జట్టుకు ఎం.షానున్ (తెనాలి), వి.రేవతి (తెనాలి), ఈఎల్ వినయశ్రీ(తెనాలి), ఎన్.నాగదివ్య (తెనాలి), బి.చంద్రిక (మంగళగిరి) ఎంపికయ్యారు. వీరు విశాఖపట్నంలో జరిగే ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల పదవ తేదీన జరిగే సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పురుషుల జట్టుకు సందాని కోచ్‌గా, గుమ్మడి వెంకటేశ్వరరావు మేనేజరుగా, మహిళల జట్టుకు విజయభాస్కరరావు కోచ్‌గా, ఘట్టమనేని సాయిరేవతి మేనేజరుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లను అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్ఎన్. వంశీకృష్ణ, బి.ప్రసాద్, పీ.భాస్కరరావు, సంయుక్త కార్యదర్శులు మస్తాన్‌వలి, నాగశిరీష, సభ్యులు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

టీడీపీ-జనసేన విజయం చారిత్రిక అవసరం

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు మార్చి 4: రాష్ట్రంలో నేడు నెలకొన్న సంక్షోభ పరిస్థితుల్లో టీడీపీజనసేన పార్టీలు అధికారంలోకి రావడం ఓ చారిత్రిక అవసరమని ఆనందబాబు అన్నారు. సోమవారం వేటపాలెంలో జరిగిన టీడీపీ, జనసేన పార్టీల మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనందబాబు మాట్లాడుతూ చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం, రాజకీయ చతురత నేడు రాష్ట్రానికి అవసరమన్నారు. తిరిగి రాష్ట్రంలో మనం అధికార పగ్గాలు చేపట్టి పూర్వ వైభవాన్ని తీసుకురావలన్నారు. జగన్ అసమర్ధ పాలనతో సామాన్యుల బతుకులు బారంగా మారాయని, ఉద్యోగుల నెల జీతాల కోసం ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర సెక్రటరేయట్ తాకట్టు పెట్టుకోవాల్సిన దుస్థితి కల్పించారని, సంక్షేమ పథకాల పేరుతో అన్నివర్గాలను మోసం రాష్ట్రాన్ని దివాళాతీయించాడని మండిపడ్డారు. జగన్ రానున్న ఎన్నికల్లో వలంటరీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందడానికి కుటిలయత్నాలు చేస్తున్నాడని, వీటిని కార్యకర్తలు క్షేత్రస్థాయిలోనే సమర్ధవంతంగా ఎదుర్కొవాలని ఆనందబాబు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, జనసేన వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఉసా రాజేష్, గూదేటి ఎల్లారెడ్డి, కావూరు శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ బాబు, రాయపాటి శ్రీను, శ్రీరామమూర్తి, కంఠంనేని రాహుల్, దేవిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

గురజాలటౌన్, మార్చి 4: అప్పులబాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మాడుగులలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బండ్ల నారాయణ (37) తనకున్న 6 ఎకరాలతోపాటు 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిరప సాగు చేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో రూ. 28 లక్షల వరకు అప్పులయ్యాయి. మనస్థాపం చెందిన నారాయణ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.


మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడుముక్కలాటతో రాష్ట్రం చిన్నాభిన్నం

● 1539 వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు , మార్చి 4: మూడు రాజధానుల మూడు ముక్కలాటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశాడని, రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు సోమవారం నాటికి 1539వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ.. అమరావతి ఐదు కోట్ల మంది ఆంధ్రుల సంపదన్నారు. దానిని నీర్వీర్యం చేసే దాక సీఎం జగన్‌రెడ్డి నిద్ర పోలేదన్నారు. ఏ వ్యస్థని సక్రమం నడపలేకపోయాడన్నారు. గాడి తప్పిన పాలన సరిచేయాలంటే విజన్ ఉన్న నాయకుడు సీఎం కావాలన్నారు. లేకపోతే రాష్ట్ర అధోగతి పాలవుతుందన్నారు. మూడు రాజధానులు అనేది హైకోర్టు తీర్పుతో ముగిసిన అధ్యాయమని, సీఎం జగన్‌రెడ్డి ఇప్పటికైనా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, వెంకటపాలెం, మందడం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

హుండీల ఆదాయం రూ.20 లక్షలు

అమరావతి, మార్చి 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల నుండి కానుకల ద్వారా రూ.20లక్షల ఆదాయం లభించినట్లు ఈవో వేమూరి గోపి తెలిపారు. 80 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ.18,37,744, అన్నదాన హుండీ ద్వారా రూ1,63,085 ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోతో పాటు పరిశీలకులు వెంకట శ్రీనివాస్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజరు కౌశల్‌శర్మ, సిబ్బంది, సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతు హత్యకేసులో వీడిన మిస్టరీ

● ఒకరు అనుమానంతో.. మరోకరు వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని తుదముట్టించిన వైనం

వినుకొండటౌన్, మార్చి4 : ఈపూరు మండలం అగ్నిగుండాల సమీపంలో కాలవకట్టపై గత నెల 21న కౌలు రైతు తులసీనాయక్‌ను హత్యచేసిన కేసులో ఎట్టకేలకు నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వినుకొండ రూరల్‌పోలీసు కార్యాలయంలో సీఐ సుధాకర్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి నిందితుల వివరాలను వెల్లడించారు. బొల్లాపల్లి మండలం మాలపాడు గ్రామానికి చెందిన భుక్యా తులసీనాయక్ (42) అగ్నిగుండాల సమీపంలో పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తు జీవణం సాగిస్తున్నాడని, అదేగ్రామానికి చెందిన రామావత్ శివానాయక్ తండ్రి శీతల నాయక్ గతంలో అనారోగ్యంతో మృతి చెందినప్పనటికీ, తులసీనాయక్ చేతబడిచేసిన కారణంగానే తన తండ్రి మృతి చెందాడని అనుమానం పెంచుకున్నాడు. అలాగే బొల్లాపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి నాగిరెడ్డి తులసీ నాయక్ భార్యతో వివాహేతర సంబంధం కలిగి అతని ఇంటికి వస్తూపోతూ ఉండేవాడు. ఈ విషయంలో తులసీనాయక్ నాగిరెడ్డిని గతంలో పలుమార్లు హెచ్చరించాడు. దీంతో శివానాయక్, నాగిరెడ్డిలు కలసి తులసి నాయక్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం వేశారు. తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ హర్బన్ దుమ్మాలపేటకుచెందిన యర్రబెల్లి గంగతో రూ.5 లక్షలకు కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. శివానాయక్ స్నేహితుడైన రామాంజినాయక్‌తో కలిసి మొత్తం నలుగురు తులసినాయక్‌ను హత్య చేసేందుకు కాపలాకాశారు. ఫిబ్రవరి 21న ఒంటరిగా ద్విచక్రవాహనంపై పొలం వెళ్ళి వస్తున్న తులసీ నాయక్‌పై గంగ కర్రతో భలంగా దాడిచెయ్యడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు సీఐ తెలిపారు. కొండ్రముట్ల సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎస్ఐలు చెన్నకేశవులు, మహమ్మద్ ఫిరోజ్, నాగిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

7న కాంగ్రెస్ బహిరంగసభ వాయిదా

గుంటూరు, మార్చి 4: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో పాటు ఇతర కాంగ్రెస్ అగ్రనేతలతో ఈనెల 7న గుంటూరులో తలపెట్టిన బహిరంగసభ వాయిదావేసినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న మహాశివరాత్రి పురస్కరించుకొని బహిరంగ సభను వాయిదా వేశామని, త్వరలోనే సభపై మరో తేదీని ప్రకటిస్తామని లింగంశెట్టి తెలిపారు.

టీడీపీ మైనార్టీ రాష్ట్ర కమిటీలోకి జిల్లా నేతలు

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు నేతలు ఎంపికయ్యారు. గుంటూరు తూర్పు నుంచి షేక్ ఖలీల్, తాడికొండ నుంచి షేక్ మొహమ్మద్ నూర్, ప్రత్తిపాడు నుంచి షేక్ అబ్దుల్ రజాక్, సత్తెనపల్లి నుంచి సయ్యద్ మహబూబ్‌లు ఎంపికయ్యారు. అలాగే టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీలో గుంటూరు పశ్చిమకు చెందిన పిన్నమనేని రామచంద్రరావు, మాచర్లకు చెందిన వాటికొండ రంగనాయకులు, పీ.పుల్లయ్య, సత్తెనపల్లి నుంచి రావిపాటి మధుబాబు ఎంపికయినట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు.


గుడారాల పండుగకు ఏర్పాటు చేసిన స్వాగత ద్వారాలు

7 నుంచి గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు),మార్చి4: హోసన్నామినిస్ట్రీస్, గోరంట్ల ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి 10వ తేది వరకు వరకు 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ జరుపుతున్నట్టు హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లీలు తెలిపారు. గుడారాల పండుగకు సంబంధించిన ఏర్పాట్లును సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో కంటే ఎక్కువ మంది ఈ పండుగలోపాల్గొనే అవకాశముందని, అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. భోజనశాల, నిద్రించేందుకు వసతులు కల్పిస్తున్నామని బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వేస్లీలు తెలిపారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

● కాకాని మల్లన్న సన్నిధిలో రేపటి నుంచి అంకురార్పణం
● పెళ్ళికొడుకు పెళ్ళి కుమార్తెగా శివపార్వతులు

పెదకాకాని, మార్చి 4: పెదకాకాని మల్లన్న సన్నిధిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రమణీయంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఆలయ ప్రాంగణం, వెలుపల భాగాలు విద్యుత్‌కాంతులతో విరాజిల్లుతున్నాయి. పెదకాకాని జాతీయ రహదారినుంచి ఆలయం వరకు ప్రత్యేక భారీ విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటుచేశారు. ప్రధాన కూడళ్లలో సూపర్ వత్తుల విద్యుత్తు కటౌట్లను తీర్చిదిద్దారు. అర్చకులు ఉత్సవ విగ్రహాలను శుభ్రపరుస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో లోపల బయట ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ ప్రసాదరావు, ఛైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావులు పర్యవేక్షిస్తున్నారు.


ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు


ఉత్సవ మూర్తుల విగ్రహాలను శుభ్రపరుస్తున్న అర్చకులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

1,12,364 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,18,979 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,12,364 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 95,450 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	19500
నెంబరు. 5	13000	19000
273	8000	16500
341	10500	20000
4884	13000	19000
సూపర్ 10	11500	15400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	20500
బ్యాడిగి	11000	19000
దేవనూరు డీలక్స్	10000	19500
తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రావణ్‌కుమార్, నసీర్, డేగల తదితరులు

'జయహో బీసీ' సభని విజయవంతం చేద్దాం

టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా మంగళవారం జరిగే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. పార్టీ తూర్పు కార్యాలయంలో సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, యర్రగొండపాలెం అభ్యర్థి యరిక్సన్ బాబు, పోతినేని శ్రీనివాస్, తూర్పు ఇన్‌చార్జి నసీర్, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ జయహో బీసీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వెన్నుముకగా వున్న బీసీల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాబోతున్నారని చెప్పారు. దేశంలోనే అతిపెద్ద బీసీ మహాసభ మంగళవారం గుంటూరులో జరగబోతోందని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడానికి గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి వేలాదిమంది తరలి వెళ్లబోతున్నారని చెప్పారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల మీద కక్ష సాధింపు చర్యలు మొదలు పెట్టాడని, తెలుగుదేశం పార్టీకి బీసీలను దూరం చేయాలని ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురిచేసినాబీసీలంతా తెలుగుదేశం పార్టీ వెంటే ఉన్నారని అన్నారు. కార్యక్రమం టీడీపీ నాయకులు దాసరి రాజామాస్టారు, వేములకొండ శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, బెళ్ళ వెంకటేశ్వర్లు, బత్తిన శంకర్, సురే శ్రీనివాస్, ఈర్ల గురవయ్య, లక్ష్మయ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేతల మీదుగా బీసీ డిక్లరేషన్ ..

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్ చేతల మీదుగా మంగళవారం బీసీ డిక్లరేషన్ విడుదల కాబోతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పశ్చిమ నియోజకవర్గ జయహో బీసీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీకి బీసీలు వెన్నెముకని, ఆ బంధం విడదీయలేదని స్పష్టంచేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలపై దాడులు పెరిగిపోయాయని, 76 మంది బీసీలను అతి కిరాతకంగా చంపారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసింది టీడీపీనేనని, ప్రతి ఒక్కరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పోతినేని శ్రీనివాసరావు, నిమ్మల శేషయ్య, సుఖవాసి శ్రీనివాసరావు, ఈశ్వరరావు, పేరయ్య, ఈరంటి వరప్రసాద్, సత్యవాణి, ముత్తినేని రాజేశ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



గుంటూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న నాగార్జునయూనివర్సిటీ ఎదురు జరగనున్న 'జయహో బీసీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ పిలుపు నిచ్చారు. పార్టీ నగర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జయహో బీసీ' సభా కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని వేదికపై ప్రకటించే బీసీ డిక్లరేషన్‌ను బలపరచాలని కోరారు. బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా బీసీ డిక్లరేషన్‌ను సభలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్‌లు ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసిన ద్రోహం, మోసాల బారి నుంచి కోలుకుని పూర్వ వైభవం పొందేలా, అన్ని రంగాల్లో బీసీలు దూసుకుపోయేలా టీడీపీ ప్రోత్సహిస్తుందన్నారు. బీసీలు ఆర్థికంగా స్థిరపడి ఆత్మగౌరవంతో బతికిన రోజునే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. బీసీ డిక్లరేషన్‌లో బీసీల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చేపట్టాల్సిన అంశాలతోపాటు, రాష్ట్ర ప్రభుత్వస్థాయిలో అమలు చేయాల్సిన నిర్ణయాలు, బీసీ కులాలవారీగా అందించాల్సిన మద్దతుకు సంబంధించిన వివరాలుంటాయని పేర్కొన్నారు.



క్రీడ పోటీలను ప్రారంభిస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

గుంటూరు, మార్చి4: అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి-8) పురస్కరించుకొని ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్జీవో హోంలో మహిళ ఉద్యోగినులకు క్రీడా పోటీలు ప్రారంభించారు. పోటీలను జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇందులో భాగంగా టక్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్ గోలి ఇన్ బాటిల్, మ్యూజికల్ చైర్స్ వంటి క్రీడలను నిర్వహించారు. బుధవారం సాంస్కృతిక విభాగంలో నృత్య విభాగం, ఫాన్సీ డ్రెస్ కాంపిటేషన్, వన్‌మినిట్ తెలుగు పాటలపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏ.శ్యాంసుందర్, కే.శివజ్యోతి, ఎఎస్పీఎస్ సూరి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

వృక్షాలు ప్రాణకోటికి జీవ నాడులు

గుంటూరు(విద్య),మార్చి 4: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -4 ఆధ్వర్యంలో నగర శివారులోని లాలుపురం గ్రామంలో ప్రత్యేక శిబిరంలో భాగంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్. కె. విజయ కుమారి తెలియచేశారు. లాలు పురం ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ స్వయంపరిమళ మాట్లాడుతూ ప్రతి ఒక్కజీవికి ప్రాణ వాయువును ఇచ్చే గొప్ప దాత వృక్షమని, అటువంటి చెట్లను విస్తారంగ పెంచితే మానవాళికి ఎంతో ఉపయోగమన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందు కనీసం రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షణ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిగాన లహరి

గుంటూరు(తూర్పు), మార్చి4: స్థానిక బృందావనగార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆలయప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం జరిగిన భక్తి సంగిత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగిత విద్వాంసులు యిమ్మడి అంజనీదేవి, డాక్టర్ కుసుమ, యశోధ, యోగేశ్వరి, భారతి, విశ్వపావని, రమామహేశ్వరి, బ్రహ్మేశ్వరిలు తమ గాత్రధారణలో పలువురు వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై శాయి, తబలాపై బాలాజీ వాయిద్య సహకారం అందించారు.



ఆలపన చేస్తున్న భక్తులు

సచివాలయం అద్దె చెల్లింపునకు నో బడ్జెట్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి, డీఆర్వో పెద్ది రోజా

● కరెంటు బిల్లులు కూడా కట్టకుండా వేధిస్తున్నారు
● అడిగితే బడ్జెట్ లేదంటున్నారు
● స్పందనలో కలెక్టర్‌కు భవన యజమాని ఫిర్యాదు
● గ్రీవెన్స్‌కు 217 అర్జీలు

గుంటూరు(తూర్పు),మార్చి4: స్థానిక పాత గుంటూరు, బాలాజీ నగర్‌లోవున్న తన బిల్డింగ్‌ను 20వ నెంబరు వార్డు సచివాలయానికి అద్దెకు ఇచ్చామని, కానీ సచివాలయ అధికారులు ఐదు నెలల నుంచి దానికి సంబంధించిన అద్దె, కరెంటు బిల్లు చెల్లించకుండా వేధిస్తున్నారని భవన యాజమాని బండారు మల్లీశ్వరీ స్పందనలో వినతి పత్రం అందజేశారు. నెలకు రూ.16వేలు చొప్పున రూ.80వేలు, కరెంటు బిల్లు రూ.35 వేలు మొత్తం రూ.1లక్ష 15 వేలు బకాయివుందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బకాయిలు చెల్లింపు విషయమై సచివాలయ అధికారులను అడిగితే నో బడ్జెట్.. అని చెబుతున్నారని, పైగా నీటి పన్నుకూడా మీరే కట్టండి అని అంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

స్పందనకు వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనకు 217 అర్జీలు వచ్చాయి. జేసీ రాజకుమారి, డీఆర్వో పీ.రోజా, డిప్యూటీ కలెక్టర్లు స్వాతి, ఆర్డీవో పీ.శ్రీకర్‌తో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. స్పందన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, సీపీవో శేషశ్రీ, సాంఘీక సంక్షేమశాఖ డీడీ మధుసూధన రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో కోమలి పద్మ, డీఈవో శైలజ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు.. వినతులు :

- ప్రభుత్వం ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములను ఇతరులకు అన్యాక్రాంతం చేస్తున్న ప్రత్తిపాడు మండలం, తుమ్మల పాలెం వీఆర్వో కే.శ్రీధర్‌బాబును తక్షణమే సస్పెండ్ చేయాలని జనంపార్టీ రాష్ట్ర అధ్యక్షులు కే.ఆనంద్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.
- వీవోఏల ఉపాధిని దెబ్బతీసే 3 సంవత్సరాల కాలపరిమితి ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ ఏపీవెలుగు వీవోఏ (యానిమేటర్లు), ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా వెలుగు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు.
- మంగళగిరి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న నాల్గో తరగతి ఉద్యోగి కే.రమేష్ 8 నెలల క్రితం క్యాన్సర్‌తో చనిపోయారని, దీనికి సంబధించిన బెనిఫిట్స్ అడుగుతుంటే నో బడ్జెట్ అని ఉన్నాతాధికారులు చెబుతున్నారని ఆయన భార్య అంధురాలు కే.కన్యాకుమారి కలెక్టర్‌కు విన్నవించారు. తనకు దాదాపు రూ. 15 లక్షలు రావల్సి ఉండగా ఇంతవరకు చెల్లించలేదని వాపోయారు.
- 70శాతం వైకల్యం ఏర్పడిందని సదరన్ సర్టిఫికెట్ అందజేసినప్పటికీ తనకు దివ్యాంగ పెన్షన్ ఇవ్వడం లేదని ఫిరంగిపురం గ్రామానికి చెందిన రామిశెట్టి జోసఫ్ ఫిర్యాదు చేశారు.
- రెండేళ్ల క్రితం విజంనంపాడు వద్ద లే అవుట్‌లో 2020 నెంబరుతో ప్లాట్ కేటాయించారని, కానీదానికి సబంధించిన పట్టా ఇవ్వకుండా తిప్పుతున్నారని 158 సచివాలయ పరిధిలోని స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన కిరణ్‌కుమార్ దంపతులు ఫిర్యాదు చేశారు.
- ఇంటి పైగా ఏర్పాటు చేసిన హై టెన్షన్ విద్యుత్ తీగలు చేయి లేపితే అందే ఎత్తులో ప్రమాదకరస్థితిలో ఉన్నాయని, దీనిపై గత ఏడాది జనవరి 1న విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోవడంలేదని రూరల్‌మండలం, తురకపాలెం బీసీ కాలనికి చెందిన తురకా ఏడుకొండలు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

● అధికారులకు జీఎంసీ కమిషనర్ కీర్తిచేకూరి ఆదేశం
● జీఎంసీ స్పందనకు 47 ఫిర్యాదులు

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 4 : స్పందనలో అందే ఫిర్యాదుల పరిష్కా రానికి అధికారులు అధిక ప్రాధాన్యమివ్వాలని గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గత వారం స్పందనలో అందిన ఆర్జీల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. స్పందన అర్జీలను ఆయా విభాగాధిపతే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలకు సిఫార్స్‌చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్పందన అర్జీల సమీక్ష సమావేశంకి ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరు కావాలని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం 47 ఫిర్యాదులు అందగా, నిర్దేశిత గడువులోగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డీ.వెంకటలక్ష్మి, ఎస్ఈ సుందరరామిరెడ్డి, డిప్యూటీ సిటిప్లానర్ శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, ఉపాసెల్ సూప రింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీసీలు, ఏసీపీలు, ఈఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి

ఓటర్ల ఫిర్యాదులను మూడు రోజులలో పరిష్కరించాలి

ఎన్నికల విధులకు సంబంధించి ఓటర్ల నుండి అందే ఫిర్యాదులను మూడు రోజుల్లోగా పరిష్కారం చేయాలని, లేకుంటే బీఎల్వోలతో పాటు సూపర్‌వైజరీ అధికారులపైనా చర్యలు తప్పవని కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తిచేకూరి స్పష్టంచేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఓటర్ల ఫిర్యాదులు- పరిష్కారం, విధుల కేటాయింపుపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్‌కేంద్రాల్లో మౌలిక వసతులను పూర్తిచేసి, ఎన్నికల నిర్వహణకు పోలింగ్‌కేంద్రాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

7న 'టీ10' క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), మార్చి 4: పెదకాకానీ మండలం, వెనిగళ్ల గ్రామం, బ్రహ్మారంబపురం కాలనీ మైదానంలో టీ10 క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 7న బుధవారం ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాలుర విభాగంలో టీ-10 క్రికెట్ జట్లు ఎంపికలు నిర్వ హిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల్గిన క్రీడాకారులు ఫోటో, ఆధార్‌కార్డుతో హాజర వ్వాలని, ఇతర వివరాలకు 6304881562 9490146113 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), మార్చి4: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఇ.యస్.యస్. నారాయణ మాస్టారు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక, వ్యవసాయం, విద్యారంగం తదితర వివిధ అంశాలలో ప్రతిభావంతులైన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 15 లోపు దరఖాస్తులు చేసుకొనుటకు చివరిరోజు అని తెలిపారు. ఇతర వివరములకు 96523 47207 ను సంప్రదించాలన్నారు. చిరునామా : ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోరు నెం.1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం, తిరుమల గిరి పోస్ట్, సికింద్రాబాద్‌కు మీ వివరములను, ఫోటోలను, పత్రికా క్లిప్పింగులను పంపవలసినదిగా కోరారు.



నారీ శక్తి వందన్ మారథాన్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో

'నారీశక్తి వందన్ మారథాన్'

గుంటూరు సిటీ,మార్చి 4: 'నారీశక్తివందన్ మారథాన్' కార్యక్రమంలో రన్‌ఫర్ నేషన్ రన్‌ఫర్ మోడీ 2కే-వాక్ కార్యక్రమాన్ని బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమై లక్ష్మీపురం మీదుగా లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు పార్టీ నాయకులు కార్యకర్తలు కళాశాల విద్యార్థులతో నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత అన్ని రంగాల్లోనూ మహిళలకు ఎంతో ప్రాధానం ఇస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా నిలబడటం కోసం అనేక సంక్షేమ పథకాలు అందుబాటులో తీసుకువచ్చారన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యద, మహిళా మోర్చా ఇన్‌చార్జి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర మాట్లాడుతూ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుటం కోసం నారీ శక్తి వందన్ మారథాన్ కార్యక్రమంలో భాగంఒగా ఈ 2కే-వాక్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్ ఇంచార్జ్ మకుటం శివ, నారీ శక్తి వందన్ కార్యక్రమ ఇంచార్జి విజయశ్రీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీకళ్యాణి, ఉపాధ్యక్షులు నాగమల్లీశ్వరి, మహాలక్ష్మి, స్రవంతి, మౌనిక, బిజెపి జిల్లా కార్యదర్సులు కత్తి మేరీ సరోజిని, ఏలూరిలక్ష్మి, దుర్గాభవాని, సుకన్య, పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్సులు చరక కుమార్‌గౌడ్, చెరుకూరి తిరుపతి రావు, ఆవుల నాగేంద్ర, పద్మనాభం, దారా అంబేద్కర్, దర్శనమ్ శ్రీనివాస్, యస్వంత్, నాగ మోహన్, వెంకటేష్, దర్శి నర్సింహారావు, కృష్ణ చైతన్య, సురేష్, పాల్గొన్నారు.

ఆర్టీసీ గుంటూరు-1 డిపో సూపర్‌వైజర్ సస్పెన్షన్

● గ్యారేజ్ నిధుల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారుల చర్యలు
● 'ఆంధ్రజ్యోతి' కథనంతో యంత్రాంగంలో కదలిక

గుంటూరు, మార్చి 4: ఆర్టీసీ గుంటూరు-1 డిపో గ్యారేజ్‌లో నిధులు గోల్‌మాల్ చేసిన వ్యవహారంపై ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. విచారణ తరువాత బాధ్యుడైన సూపర్‌వైజర్ జయరావును సస్పెండ్ చేస్తూ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం. రవికాంత్‌ఆదేశాలు జారీ చేశారు. గ్యారేజ్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారం గుట్టును రట్టు చేస్తూ గత నెల 12న 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'ఆర్టీసీ గ్యారేజ్ నిధులు గోల్‌మాల్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. గుంటూరు-1 డిపో గ్యారేజ్‌లో డిపార్ట్‌మెంట్‌కు చెందిన నిధులు సూపర్‌వైజర్ ఏకంగా రూ. 1లక్షా 80వేలు దారి మళ్ళించారు. సాధారణంగా డిపోకు చెందిన గ్యారేజ్‌లో బస్సులకు ఆటోమొబైల్ పరికరాలకు సంబంధించి ఆ శాఖ నిధులు మంజూరు చేస్తుంది. సూపర్‌వైజర్ ఆయా నిధులతో కొనుగోలు చేస్తూ పక్కా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలానే ఇక్కడ డిపోలో మంజూరుచేసిన నిధులను సూపర్‌వైజర్ తన సొంత అవసరాలకు పక్కదారి పట్టించినట్లు తేలింది. ఆటో మొబైల్ విక్రయించిన సదరు సంస్థలు తమకు బకాయిలు చెల్లించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్ళటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సదరు సూపర్‌వైజర్ నిధులు సొంతానికి వాడుకున్నట్లు సమాచారం రావటంతో ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు కూడా విచారణ జరిపి నివేదిక అందజేశారు. కాగా బాధ్యునిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు విచారణ పేరుతో మీనమేషాలు లెక్కిస్తున్నారన్న విమర్శలు వినిపించాయి. పైగా సదరు ఉద్యోగి అధికార పార్టీకి చెందిన యూనియన్ నేత కావటంతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. ఈవ్యవహాకరంపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితమవటంతోసదరు బాధ్యుడిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



టీడీపీ కార్యాలయంలో గంటా శ్రీనివాసరావుతో భరతరెడ్డి

వైసీపీ ప్రభుత్వంలో తిరోగామి పాలన

● భీమనాథం భరత్‌రెడ్డి, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు
● ఆటోనగర్‌లో టీడీపీ కార్యాలయం ప్రారంభం

గుంటూరు, మార్చి4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పాలన తిరోగామి దిశలో ప్రయాణిస్తుంటే, అభివృద్ధి కోసమే తాను టీడీపీ చేరినట్లు భీమనాధం భరత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆటోనగర్‌లో ఆయన టీడీపీ కార్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మహమ్మద్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డి దక్కింది అన్నారు. రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి తీసుకెళ్లి ప్రజలపై పెను భారాన్ని మోపారన్నారు. ఈ సందర్భంగా సంగడిగుంట రెడ్ల బజార్‌లోని భరత్ రెడ్డి ఇంటి వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్,వెన్నా సాంబి రెడ్డి, కూసం బ్రహ్మారెడ్డి, గుంటూరు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి, కూచిపూడి ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నిజం చేసిన ప్రభుత్వం

● వైసీపీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా

గుంటూరు, మార్చి 4: పేదలక సొంతింటి కలను నిజం చేసిన ప్రభుత్వం తమదేనని వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా అన్నారు. నగరంలోని 3, 8, 51 డివిజన్‌లలో బాలాజీనగర్, శ్రీనగర్ సచివాలయాలపరిధిలోని అర్హులైనవారికి నవరత్నాలు పేదలందరికి ఇళ్ళు పథకంలో భాగంగా ఇళ్ళ స్థలాలను పట్టాలను సోమవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల కుటుంబాలకు ఇళ్ళ స్థలాలను ఇచ్చి, నిర్మాణాలు కూడా పూర్తిచేసి అందచేసి ఇచ్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్‌లు యిర్రి ధనలక్ష్మీ, పోలవరపు జ్యోతి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఒక జత స్త్రీ బీజకోశాలు, ఒక జత స్త్రీ బీజవాహికలు, గర్భాశయం, యోని, అనుబంధ గ్రంథులు ఉంటాయి. ఈ భాగాలు స్త్రీలలో శ్రోణి ప్రాంతంలో ఉంటాయి.


స్త్రీ బీజకోశాలు: ఇవి ఉదర కుహరంలో ఒక జతను కలిగి ఉండి, అండాలను, స్త్రీ బీజకోశ హార్మోనులను ఉత్పత్తి చేస్తాయి. వీటిలో అనేక స్త్రీ బీజ కోశపుటికలు ఉంటాయి. ఈ పుటికలలో అండాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పుటికలు ప్రారంభంలో చిన్న చిన్న బుడగల రూపంలో ఉంటాయి. ప్రతి పుటికలోను ఒక అండం ఉంటుంది. అండం పరిపక్వం చెందినపుడు, పుటిక పగిలి అండం విడుదలవుతుంది. ఇలా అండం విడుదల కావడాన్ని అండోత్సర్గం అంటారు. అండాలు స్త్రీ బీజ వాహికలలోకి ప్రవేశిస్తాయి.

స్త్రీ బీజవాహిక: దీనిని ఫాలోపియన్ నాళం అని కూడా పిలుస్తారు. ఇవి ఒక జత ఉంటాయి. స్త్రీ బీజకోశం నుంచి ఇవి బయలుదేరుతాయి. దీనిలో కాలాంచిక, కలశిక, ఇస్తమస్ అనే నిర్మాణాలు ఉంటాయి. కాలాంచిక అనేది గరాటు ఆకారంలో ఉండి స్త్రీ బీజకోశం నుంచి విడులైన అండాలను సేకరిస్తుంది. కాలాంచిక నిర్మాణం తరవాత భాగమైన కలశికలోకి, కలశిక చివరి భాగమైన సన్నటి గ్రీవము(ఇస్తమస్) ద్వారా గర్భాశయంలోకి తెరచుకుంటుంది. ఫాలోపియన్ నాళంలోని కలశికలో శుక్రకణాలు, అండంలో ఫలదీకరణ చెందుతాయి.

గర్భాశయం: రెండు వైపులా ఉండే స్త్రీ బీజవాహికలు ఈ గర్భాశయంలోకి తెరచుకుంటాయి. గర్భాశయం... శ్రోణి ప్రాంతంలో మూత్రాశయానికి, పురీషనాళానికి మధ్య విశాలంగా, ధృడంగా, కండరయుతమై అధిక ప్రసరణ గల తలకిందులైన పియర్ ఆకారం పరిమాణంలో ఉండే కోశం లాంటి నిర్మాణం. పెరిమెట్రియం, మయోమెట్రియం, ఎండోమెట్రియం అనే మూడు కణజాలపు పొరలతో గర్భాశయకుడ్యం నిర్మితమైంది. గర్భాశయ ఎండోమెట్రియం రుతుచక్రంలో చక్రీయ మార్పులకు లోనైతే, ప్రసవ సమయంలో గర్భాశయ మెయోమెట్రియం ధృడమైన సంకోచాలను ప్రదర్శిస్తుంది. దీనిలో పిండ ప్రతిస్థాపనకు అనుకూల వాతావరణపు నియంత్రిత వ్యవస్థ ఉంటుంది. ప్రొజెస్టిరాన్ హార్మోన్ సహాయంతో ఫలదీకరణ చెందిన అండము గర్భాశయ కుడ్యంలో వున్న మృదు కణజాలానికి అతుక్కుంటుంది.

యోని: యోని విశాలంగా ఉండే తంతు-కండర యుత నాళం. దీనిని స్త్రీ బాహ్యజననాంగముగా పేర్కొంటారు. యోనిలో ఊర్ధ్వ, నిమ్న అనే రెండు రంధ్రాలుంటాయి. ఊర్ధ్వ రంధ్రాన్ని బాహ్యప్రసేక రంధ్రం అని, నిమ్న రంధ్రాన్ని యోని రంధ్రం అని పేర్కొంటారు. ప్రసేకం రంధ్రంపైన క్లిటోరిస్ అనే సున్నితమైన సంభించగల నిర్మాణం ఉంటుంది. ఇది పురుష మేహనానికి సమజాతము. యోనిపై భాగంలోని ఉబ్బెత్తు ప్రాంతాన్ని మాన్స్‌ప్యూబిస్ అంటారు. దీని చర్మంపై జఘన రోమాలు, చర్మం కింద కొవ్వు కణజాలపు దిండు ఉంటుంది.

అనుబంధ గ్రంథులు: స్త్రీలలో ప్రత్యుత్పత్తి అనుబంధ గ్రంథులు వరుసగా... బార్తోలిన్ గ్రంథులు, స్కీన్ గ్రంథులు, క్షీర గ్రంథులు. యోని రంధ్రానికి కొద్దిగా కిందగా ఇరువైపులా అమరి ఒక జత బార్తోలిన్ గ్రంథులు ఉంటాయి. వీటి స్రావం యోని మార్గాన్ని సులభంగా జారేటట్లు చేస్తుంది. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని బల్బోయూరెత్రల్ గ్రంథులకు సమజాతం. స్కీన్ గ్రంథులు అనేవి ప్రసేకం కింద ఉంటాయి. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని పౌరుష గ్రంథులకు సమజాతం. ఇవి ప్రేరేపితమైనప్పుడు క్షార జిగట ద్రవాన్ని స్రవిస్తాయి. ఒక జత క్షీర గ్రంథులు శిశు జననాంతరం మాత్రమే పనిచేయడం ప్రారంభిస్తాయి. పురుషులలో ఇవి క్రియారహిత అవశేషాంగాలుగా ఉంటాయి.



బీజ కణోత్పత్తి: బీజకణోత్పత్తి అంటే ప్రాథమిక లైంగిక అవయవాలైన ముష్కం, స్త్రీ బీజకోశాల నుంచి బీజకణాలు(సంయోగ బీజాలు) ఏర్పడటం. పురుషులలో జరిగే బీజకణోత్పత్తిని శుక్రకణోత్పత్తి అని, స్త్రీలలో జరిగే బీజకణోత్పత్తిని అండోత్పత్తి అని అంటారు.

శుక్రకణ నిర్మాణం: శుక్రకణ సూక్ష్మ నిర్మాణంలో... తల, మెడ, మధ్యభాగం, తోక అనే భాగాలు ఉంటాయి. తలభాగంలో ఏక్రోజోమ్ అనే టోపి లాంటి నిర్మాణం ఉంటుంది. ప్రోటియేజ్‌లు, ఏసిడ్ ఫాస్ఫటేజ్, హైలురోనిడేజ్ అనే ఎంజైములు ఏక్రోజోమ్‌లో ఉంటాయి. ఏక్రోజోమ్ అనేది ఫలదీకరణ సమయంలో శుక్రకణం, అండంలోకి చొచ్చుకొని పోయేందుకు సహాయపడుతుంది. తల భాగంలో ఏకస్థితిక కేంద్రం ఉంటుంది. మెడ అనేది తలభాగానికి, మధ్య భాగానికి ఉండే భాగం. మెడ కింది భాగాన్ని మధ్యభాగంగా పేర్కొంటారు. ఈ మధ్య భాగంలో మైటోకాండ్రియాలు చాలా ఉంటాయి. ఇవి శుక్ర కణాల తోక కదలిక, చలనానికి కావలసినంత శక్తిని అందిస్తాయి. మధ్యభాగం కింద ఉన్న నిర్మాణాన్ని తోకగా పేర్కొంటారు. ఈ తోక శుక్ర కణం చలించడానికి తోడ్పడుతుంది.

అండం: స్త్రీ బీజకోశం నుంచి విడుదలైన అండం పూర్తిగా పరిణితి చెందినది కాదు. ఇది జోనా పెల్యూసిడా చేత ఆవరించి ఉంటుంది. అండం విడుదల కావడాన్ని అండోత్సరం అంటారు. అండోత్సరం తరవాత గ్రాపియన్ పుటికలలోని గ్రాన్యులోసా కణాలు విభజన చెంది కార్పస్ లూటియం అనే పసుపు రంగులో ఉండే తాత్కాలిక అంతఃస్రావగ్రంథి కణజాలంగా ఏర్పడుతుంది. కార్పస్ లూటియం ప్రొజెస్టిరాన్ అనే హార్మోనును స్రవిస్తుంది.

రుతుచక్రం: స్త్రీ జీవులలో జరిగే ప్రత్యుత్పత్తి వలయాన్ని రుతుచక్రం అంటారు. రుతుచక్రం అంటే ప్రతి నెల గర్భాశయ అంతర ఉపకళ(ఎండోమెట్రియం)లో జరిగే మార్పుల చక్రం. స్త్రీలలో ప్రతి 28 రోజుల కొకసారి రుతుచక్రం జరుగుతుంది. రుతు చక్రం మధ్యలో ఒక అండం విడుదలవుతుంది. రుతుచక్రాన్ని రుతుస్రావ దశ, పుటిక దశ, అండోత్సర దశ, టాలియల్ దశ అనే నాలుగు దశలుగా విభజించవచ్చు. మొదటి రుతుచక్రం యవ్వన దశలో(10 నుంచి 14 సంవత్సరాలు) ప్రారంభమవుతుంది. దీన్ని రజస్వల లేదా మెనార్కి అంటారు. స్త్రీలలో 45 నుంచి 50 సంవత్సరాల వయసు మధ్యలో రుతుచక్రం ఆగిపోవడాన్ని రుతువిరతి లేదా ముట్లుడగడం(మెనోపాజ్) అంటారు.

సంపర్కం - ఫలదీకరణం: సంపర్క సమయంలో మేహనం యోనిలోకి శుక్రద్రవాన్ని స్కలిస్తుంది. చలన సహిత శుక్రకణాలు వేగంగా, ఈదుతూ గర్భాశయ ద్వారం గుండా గర్భాశయంలోకి ప్రవేశించి చివరకు ఫాలోపియన్ నాళం ఇస్తమస్ ద్వారా కలశికలోకి చేరుతాయి. ఇక్కడ స్త్రీ బీజకోశం నుంచి విడుదలై కాలాంచిక ద్వారా వచ్చిన అండంతో కలుస్తుంది. మానవునిలో అంతర ఫలదీకరణ జరుగుతుంది. ఫలదీకరణ తర్వాత సంయుక్త బీజం అనే నిర్మాణం ఏర్పడుతుంది.

పిండ త్వచాలు: పిండ ప్రతిస్థాపన అనంతరం పిండంలోని కొన్ని కణాలు పిండానికి పోషణ, రక్షణ, ఆధారమునివ్వటానికి వేర్వేరు త్వచాలుగా అభివృద్ధి చెందుతాయి. వీటినే పిండ త్వచాలు అంటారు. అవి.. పరాయువు, ఉల్బము, అళిందము, సోనసంచి.



కె.నాగేశులు,
సీనియర్ ఫ్యాకల్టీ

ఆంధ్రప్రదేశ్ గురుకులాల్లో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ సెట్



గుంటూరులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఆర్‌ఈఐఎస్) - ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏపీఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 జనరల్ కేటగిరీ, 3 మైనారిటీ కేటగిరీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్ర రీజియన్ గురుకులాలు(జనరల్)

- విజయనగరం జిల్లా-తాటిపూడి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 12, సీఈసీ 15, ఈఈటీ 10, సీజీటీ 11 సీట్లు; బాలికలకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 13, సీఈసీ 15, ఈఈటీ 11, సీజీటీ 10 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 68, బైపీసీ 51, ఎంఈసీ 42, సీఈసీ 39 సీట్లు ఉన్నాయి.
- తిరుపతి జిల్లా-వెంకటగిరి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.

రాయలసీమ రీజియన్ గురుకులాలు(జనరల్)

- కర్నూలు జిల్లా బనవాసి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- అన్నమయ్య జిల్లా-గ్యారంపల్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- శ్రీ సత్యసాయి జిల్లా-కొడిగెనహళ్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 50, బైపీసీ 30, ఎంఈసీ 25, సీఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఈఈటీ 5, సీజీటీ 5 సీట్లు; బాలికలకు ఈఈటీ 4, సీజీటీ 4 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 12, బైపీసీ 9, ఎంఈసీ 3, సీఈసీ 6 సీట్లు ఉన్నాయి.

మైనారిటీ గురుకులాలు

- గుంటూరు, కర్నూలు జిల్లాల్లో బాలుర గురుకులాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా-వాయల్పాడులో బాలికల గురుకులం ఉంది. ఒక్కో గురుకులంలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకుగాను ఒక్కోదానిలో మైనారిటీలకు 32, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2 సీట్లు; సీఈసీలో మైనారిటీలకు 28, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ అర్హులే. మొదటిసారే ఉత్తీర్ణులు కావాలి. పదోతరగతి స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా చదివినవారు మాత్రమే ఉర్దూ మీడియంలో చేరేందుకు అర్హులు.

ఏపీఆర్‌జేసీ సెట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ/ఈఈటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ/సీజీటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్; ఎంఈసీ/సీఈసీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి.

ఏపీఆర్‌జేసీ సెట్ రాసే విద్యార్థులకు:

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31

మైనారిటీ విద్యార్థులకు:


- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/SDe5ZXnలో చదవండి.

రాజమౌళి, మహేశ్ చిత్రం ఎప్పటినుంచి అంటే...!



దర్శక ధీరుడు రాజమౌళితో చేయబోయే యాక్షన్ అడ్వంచర్ చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు మహేశ్ బాబు. ఇందు కోసం తన లుక్‌ను కూడా సరికొత్తగా మార్చుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి ఆయన అప్‌డేట్ ఇచ్చారు. అందరిలానే తానూ రాజమౌళితో చేసే చిత్రం షూటింగ్ ప్రారంభం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. ప్రొఫెషన్‌ను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం కత్తి మీద సాము లాంటిదని మహేశ్ అన్నారు. తన రీసెంట్ రిలీజ్ 'గుంటూరు కారం' చిత్రంపై ప్రేక్షకులు చూపిన ఆదరణ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని మార్చేసిన మూడు సినిమాల గురించి మహేశ్ ప్రస్తావించారు. 'మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు ప్రేక్షకుల ముందు తనను సరికొత్తగా ఆవిష్కరించాయని తెలిపారు. తాను నటించే చిత్రాలకు అంగీకారం తెలిపేముందు పాత్ర, నైతిక విలువలను దృష్టిలోకి తీసుకుంటానని అన్నారు. ఒకసారి చిత్రానికి సైన్ చేశాక దర్శకుడి విజన్ ప్రకారమే ముందుకెళ్తానని తెలిపారు.



మిడిల్ క్లాస్ రాముడు

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం టీజర్ విడుదలైంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకుడు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది.

గోపీసుందర్ కంపోజ్ చేసిన 'దేఖోరే దేఖో' పాటతో హీరో క్యారెక్టరైజేషన్‌ను వర్ణిస్తూ సాగిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. సర్‌నేమ్‌కు సరెండర్ అయి, ఫ్యామిలీ అంటే వీక్‌నెస్ ఉన్న మిడిల్ క్లాస్ రాముడిగా హీరో విజయ్‌ను టీజర్ లో చూపించారు. ఈ టీజర్ చివరిలో హీరోయిన్ మృణాల్ 'నేను కాలేజీకి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా' అని అడిగితే, 'లీటర్ పెట్రోలు కొట్టిస్తే దించేస్తా' అంటాడు హీరో. ఇలా ఫ్యామిలీ, క్లాస్, మాస్, లవ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో కట్ చేసిన టీజర్ కంప్లీట్ మూవీని షార్ట్‌గా చూసిన అనుభూతి కలిగించింది. ఈ సమ్మర్‌కు కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా 'ఫ్యామిలీ స్టార్' ఉండబోతోందనే క్లారిటీని ఈ టీజర్ ఇచ్చింది.

గామి... సాహస ప్రయాణం

చాందినీ చౌదరి



విశ్వక్‌సేన్ నటించిన 'గామి' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ చిత్ర కథానాయిక చాందినీ చౌదరి సోమవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

- 'వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాలు.. ఇలా విభిన్న లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ టీమ్‌లో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. చాలా సవాల్‌తో కూడిన సరిస్థితుల్ని ఎదుర్కొన్నాం. ముఖ్యంగా వాష్ రూమ్ ఫెసిలిటీస్ లేకపోవడంతో నీళ్లు కూడా తాగేదాన్ని కాదు. దాదాపు నెల రోజుల పాటు అలా షూటింగ్ చేశాం. స్టంట్స్ నేనే రియల్‌గా చేశా. ఒక రకంగా చెప్పాలంటే గామి నిర్మాణం..సాహస ప్రయాణం.
- కథ వినగానే చిత్ర నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందని అర్థమైంది. ఎందుకంటే చాలా పెద్ద కాన్వాస్ ఉన్న కథ ఇది. దర్శకుడు విద్యాధర్ తను అనుకున్నది వచ్చే వరకూ వదిలిపెట్టరు. షూటింగ్‌కు ఎక్కువ సమయం తీసుకున్నాం కనుకే విజువల్స్ అద్భుతంగా వచ్చాయి.

'భీమ'లో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్

నిర్మాత కె.కె. రాధామోహన్



'గోపీచంద్ ఇంతకుముందు చాలా పోలీస్ పాత్రలు చేశారు. కానీ 'భీమ'లో పాత్ర విభిన్నంగా ఉంటుంది. కొత్త జానర్‌లో ఉండే కథ ఇది. ఇలాంటిది గోపీచంద్ కూడా చేయలేదు. ఇందులో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉన్నాయి. సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పోలీస్ గెటప్ కాకుండా ఇందులో గోపీచంద్ మరో గెటప్ కూడా ఉంది. అదేమిటనేది మార్చి 8న తెలుస్తుంది' అని చెప్పారు నిర్మాత కె.కె. రాధామోహన్. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన 'భీమ' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణ గారి 'అఖండ' చిత్రానికి మా సినిమాకీ ఏ మాత్రం పోలిక లేదు. బెంగళూరు, బాదమి పరిసర ప్రాంతాల్లో ఉండే పరశురామ క్షేత్రంలో జరిగే కథ ఇది. శివాలయం, అఘోరాలను యాంబియన్స్ కోసం చూపించాం. అఘోరాలకు ఈ కథతో సంబంధం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు హర్షను తెలుగు తెరకు పరిచయం చేయడం గురించి వివరిస్తూ 'ముందు మనం కథని నమ్మాలి. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కథ ఉందా లేదా అని చూడాలి. దానికి తగ్గ నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎన్నుకోవాలి. హర్ష చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తను కొరియోగ్రాఫర్ కూడా. మా 'బెంగాల్ టైగర్' చిత్రానికి వర్క్ చేశారు. 'భీమ'ని అద్భుతంగా తీశారు. రెండు పాటలకు కొరియోగ్రఫీ కూడా చేశారు' అన్నారు.

ప్రతి భారతీయుడు గర్వించే సినిమా

నిహార్ కపూర్



సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు రూపొందించిన పాన్ ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటి జయసుధ తనయుడు నిహిర్ కపూర్ ఇందులో ఒక హీరోగా నటించారు. విడుదల సందర్భంగా ఆయన సోమవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- ఇంతకుముందు నేను 'గ్యాంగ్‌స్టర్ గంగరాజు' చిత్రంలో నటించాను. ఆ సినిమా షూటింగ్‌లో శ్రీనివాసరావుగారు 'బాగా చేస్తున్నావు.. నా దగ్గర ఓ కథ ఉంది. నువ్వు యాప్ట్ అవుతావు' అని కథ చెప్పారు. చాలా ఎక్సయిటింగ్‌గా అనిపించి నేను ఈ సినిమా ఒప్పుకొన్నాను. ఇద్దరు అనాధలు అడవిలో పెరుగుతుంటారు. కవలలైన వాళ్లిద్దరూ పట్నం వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఈ చిత్రకథ. చాలా ఆసక్తికరంగా చూపించారు.
- 'దంగల్' చిత్రానికీ ఈ కథకు పోలిక లేదు. ఇందులో కుస్తీ పోటీల గురించి చెబుతూ ఇద్దరు అనాథల జర్నీని ఆకట్టుకొనే విధంగా చూపించారు. సెంటిమెంట్, ఎమోషనల్ అంశాలు కలిగిన కమర్షియల్ చిత్రమిది. సాంగ్స్, ఫైట్స్ బాగుంటాయి.
- రాజస్థాన్, హర్యానా వంటి ప్రాంతాల్లో కుస్తీ పోటీలు ఎక్కువగా జరుగుతాయి. డీటైలింగ్ మీద ఉత్తరాది వారు ఎక్కువ సినిమాలు తీస్తుంటారు. 'రికార్డ్ బ్రేక్' తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు గర్వించే విధంగా ఉంటుంది. ఇలాంటి చిత్రం తెలుగుతోనే ఆగిపోకూడదు. అందుకే ఎనిమిది భాషల్లో విడుదల చేస్తున్నాం.
- శ్రీనివాసరావుగారికి సినిమా అంటే ప్యాషన్. దేశభక్తి మిళితమైన మంచి కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా జనాలకు చెప్పాలనుకున్నారు. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు.
- ఇక నుంచి నటనని కంటిన్యూ చేస్తా. అలాగే దర్శకత్వం కూడా చేయాలనుకుంటున్నాను. స్క్రిప్టులు తయారు చేస్తున్నా.

వినూత్నంగా ఆయ్



మ్యాడ్ మూవీతో కుర్రకారును మెప్పించారు నార్నే నితిన్. తాజాగా ఈ నటుడు నయన్ సారికతో కలసి 'ఆయ్' చిత్రంలో నటిస్తున్నారు. అంజి కంచిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసుతో సంయుక్తంగా విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. 'ఆయ్' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసింది. అందులో భాగంగానే ఈ హిలేరియస్ ఎంటర్టైన్‌మెంట్ టైటిల్‌ను అనౌన్స్ చేశారు. నిర్మాత బన్నీవాస్, నార్నే నితిన్, నయన్ సారిక, డైరెక్టర్ అంజిపల్లి మధ్య జరిగే సరదా ఫోన్ సంభాషణతో టైటిల్‌ను వినూత్నంగా ప్రకటించారు. సరదా సంభాషణ, ఫన్నీ మీమ్స్ రిఫరెన్స్‌లతో సాగే ఈ వీడియో అందరినీ మెప్పిస్తోంది. ఈ వీడియోలో 'సమ్మర్‌లో కలుద్దాం' అంటూ హింట్ ఇచ్చారు. మార్చి 7న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్- సమీర్ కల్యాణి, సంగీత దర్శకుడు- రామ్ మిర్యాల, ఎడిటర్- కోదాటి పవన్ కల్యాణ్, ఆర్ట్ డైరెక్టర్- కిరణ్ కుమార్ మన్నె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- అజయ్ గద్దె, సహ నిర్మాతలు- భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/afTXIlU లో చదవండి.

గుంటూరు రూరల్ వార్తలు

అభ్యర్థులను మార్చినా ఆగని వలసలు



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు, తటస్థులు

- టీడీపీలో చేరిన 150 కుటుంబాలు
- కండువా కప్పి ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరి, మార్చి 4: మంగళగిరిలో వైసీపీ అభ్యర్థులను మార్చినప్పటికీ ఆ పార్టీ నుంచి టీడీపీలోకి వలసలు మాత్రం ఆగడంలేదు. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేసిన ప్రకటనకు నియోజకవర్గ ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వైసీపీ నేతలు, కార్యకర్తలతోపాటు తటస్థులు సైతం పెద్ద ఎత్తున టీడీపీలో చేరుతున్నారు. తాజాగా తాడేపల్లి, దుగ్గిరాల మండలాలకు చెందిన 150 కుటుంబాలు సోమవారం యువనేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని నివాసంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. తాడేపల్లి పట్టణానికి చెందిన ఎస్.రామశంకర్, బి.రవికుమార్‌తో సహా 20 మంది, ఉండవల్లి గ్రామానికి చెందిన శింగంశెట్టి తేజోదర్, ఉప్పు సుబ్బారావు (నాని)తోపాటు 20 మంది, దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామానికి చెందిన సుమారు వంద కుటుంబాల వారు లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకు న్నారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామం నుంచి నెమలికంటి అనంత్‌తోపాటు నేతలు శ్రీకృష్ణ లెనిన్, గుమ్మడి గోపి, వలపర్ల రామారావు, కనపర్తి హరి, మల్లవరపు మాణిక్యాలరావు, ఆరుమళ్ల సుబ్బారావు, మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కుంచనపల్లి గ్రామానికి చెందిన బోయిన బన్ను, గంగోలు పనుష్‌బాబు, బిరుదుగడ్డ లక్కీ, కాలే కనకరాజుతోపాటు మరో పది కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరందరికీ లోకేశ్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీ, జనసేన కలయికలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం

- రాష్ట్రప్రజలు విసిగిపోయారు... మార్పు కోరుకుంటున్నారు
- జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్



దుగ్గిరాల ఆలీనగర్‌లో ముస్లింలతో మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

దుగ్గిరాల, మార్చి 4: టీడీపీ, జనసేన కలయికలో అభివృద్ధి అంటే చేసి చూపిస్తామని జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి నియోజకవర్గం కొలకలూరు పరిధిలోనున్న దుగ్గిరాల గ్రామశివారు ఆలీనగర్‌లో ముస్లింలను సోమవారం సాయంత్రం మనోహర్ కలిసి మాట్లాడారు. ప్రజలు వైసీపీ ప్రభుత్వంతో విసిగిపోయారని మార్పుకోరుకుంటున్నారని అన్నారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంగళగిరి-తెనాలి మధ్య నున్న రహదారిని నాలుగులైన్ల రోడ్డుగా పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు. తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్ విస్తరణ లేక గుంతలమయమై ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల కఠెవరం వద్ద ఓచిన్నారి ప్రాణాలు కోల్పోయిన సంఘటన తనను ఎంతగానే కలచి వేసిందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే నారా లోకేశ్‌తోనూ మాట్లాడామన్నారు. కొలకలూరు గ్రామపంచాయతీలో ఉన్నప్పటికీ శివారులో ఉండటం కారణంగా ప్రభుత్వం నుంచి రావలసిన స్థాయిలో అభివృద్ధి నిధులు రాలేదన్నారు. ఇక్కడి ముస్లింలు ఎప్పటినుంచే శ్మశాన వాటిక వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణం చేయాలని కోరుతున్నారని, తాము అధికారంలోకి రాగానే వంతెన నిర్మాణం చేపడతామన్నారు. డ్రైనేజి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతేడాది విద్యుత్‌షాక్‌కు గురై కోలుకుంటున్న, సుభాని కుమారుడు సాదిక్‌ను పరామర్శించారు. ముస్లింలను కలిసిన మనోహర్‌కు హాజీ షేక్ సుభాని, టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు స్థానిక ముస్లింలు ఘనస్వాగతం పలికారు

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలకు అవకాశం

మంగళగిరి, మార్చి 4: మంగళగిరి నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి ఓటర్ల నుంచి అభ్యంతరాలకు అవకాశం కల్పిస్తున్నట్టు మంగళగిరి తహసీల్దారు, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కే.వెంకటేశ్వరరావు తెలిపారు. గతేడాది ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన తరువాత తెలుగుదేశం పార్టీ తరఫున అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఒకే పోలింగ్ బూత్, ఒకే డోర్ నెంబరు, ఒకే సెక్షన్‌లో ఉండవలసిన ఒక కుటుంబానికి సంబంధించిన ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లు, సెక్షన్లలో నమోదయ్యాయని, ముసాయిదా జాబితాలో జరిగిన అవకతవకలపై తగిన విచారణ జరిపించి తుది ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి తప్పులను సరిచేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. టీడీపీ అభ్యర్థనలపై విచారణ జరిపిస్తూనే తప్పొప్పులను సరిచేసే ప్రక్రియను ప్రారంభించినట్టు తెలిపారు. ఓటర్లు తమ కుటుంబసభ్యులకు చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ బూత్‌లో వేరే సెక్షన్‌లో ఉన్నట్టయితే ఫారం-8 (కరెక్షన్), వేరే పోలింగ్ బూత్‌లో ఉన్నట్టయితే ఫారం-8 (మైగ్రేషన్) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్జీలపై తగిన విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్

తాడికొండ, మార్చి 4: తాడికొండలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి సోమవారం చేరారు. వైసీపీలో కీలకంగా పనిచేసిన కొలికపూడి ఉమామహేశ్వర రావు (బుజ్జి) ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. దీంతో బుజ్జితో పాటు కొలికపూడి రాయన్న, శేషు, శివ, పొన్నెకంటి అజయ్‌బాబు, బాపయ్య, సిద్దు, దేవదానం, సుబ్బారావు, శేషం శ్యామ్, వాడపల్లి ప్రసన్న కుమార్‌లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో పార్టీ కండువాకప్పుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు, మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్‌కుమార్, తలశిల ప్రసన్నకుమార్, షేక్ రిజ్వాన, తదితరులు పాల్గొన్నారు.





అమరావతి ఉద్యమం చరిత్రలో నిలుస్తుంది

● కాంగ్రెస్ పార్టీ రాజధాని రైతులకు అండగా ఉంటుంది

● రాజ్యసభ మాజీ సభ్యుడు జేడీ శీలం



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జేడీ శీలం

తుళ్లూరు, మార్చి 4: అమరావతి ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాజ్యసభ మాజీ సభ్యుడు జేడీ శీలం అన్నారు. సోమవారం ఆయన రాజధాని రైతు ధర్నా శిబిరాలకు వచ్చి సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజధాని రైతులకు అండగా ఉంటుందన్నారు. అమరావతే ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా ఉంటుందని అందుకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మద్దతునిస్తుందన్నారు. పార్లమెంట్‌లో కూడా అమరావతి రైతుల గురించి మాట్లాడామన్నారు. రాష్ట్రానికి అమరావతి రైతులకు బంగారు రోజులు రాబోతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇవ్వటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. హోదాతో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. విభజన సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వటానికి అప్పటి ప్రతిపక్షమైన బీజేపీ కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి కూడా హోదా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అనంతరం జేడీ శీలం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, రాష్ట్ర నాయకులు చిలకా విజయ్, సీనియర్ నాయకులు కొమ్మినేని రామాంజనేయులు, రాజధాని రైతు సమన్వయ కమిటీ సభ్యులు ధనేకుల రామారావు, పువ్వాడ సుధాకరరావు, గొర్నేని స్వరాజ్యరావు, కాటా అప్పారావు, జొన్నలగడ్డ కిరణ్, ఉప్పలపాటి సాంబశివరావులతో 7న కాంగ్రెస్ సభ గురించి చర్చించారు. రైతులకు మద్దతునిచ్చే ఏ పార్టీనైనా ఆదరిస్తామని రైతు జేఏసీ నేతలు కాంగ్రెస్ నాయకులకు తెలిపారు.

ప్రమాదబాధిత రైతులకు సీఎం న్యాయం చేయాలి

● రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



దీక్షలో పాల్గొన్న రైతులకు సంఘీభావం తెలియజేస్తున్న ఆర్ కృష్ణయ్య

దుగ్గిరాల, మార్చి 4: కోల్డ్‌స్టోరేజి ప్రమాద బాధిత రైతులకు న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి చొరవతీసుకోవాలని రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. కోల్డ్‌స్టోరేజిలో జనవరి 19న జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు కొనసాగిస్తున్న విషయం విదితమే. సోమవారం దీక్షా శిబిరానికి వచ్చి, రైతులకు సంఘీభావం తెలిపిన అనంతరం, కృష్ణయ్య మాట్లాడుతూ రికార్డులు ప్రభుత్వానికి అందాయా, తమకు బీమాతో పాటు పరిహారం పూర్తిగా అందుతుందో లేదో అయోమయం నెలకొందన్నారు. విచారణ కమిటీ నివేదిక ఎప్పుడు వస్తుందో తెలియక ఆందోళనకు గురవుతున్నారన్నారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, పసుపు రైతుసంఘ రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకర్, జిల్లా రైతు ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, బాపట్ల జిల్లా రైతుసంఘ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, వ్యవసాయకార్మికసంఘ జిల్లా ప్రధానకార్యదర్శి ఈమని అప్పారావు, జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, మండల రైతుసంఘ అధ్యక్షుడు యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, రైతులు రంగారెడ్డి, రమేష్, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి జయహో బీసీ సభకు భారీగా తరలిరావాలి

తాడేపల్లి టౌన్, మార్చి 4: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ గ్రౌండ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరగనున్న రాష్ట్రస్థాయి జయహో బీసీ సభకు టీడీపీ, జనసేన శ్రేణులు భారీగా తరలిరావాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి పట్టణ టీడీపీ కార్యాలయంలో బీసీ నేతలతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దానబోయిన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బీసీల సత్తా చాటాలని, వ్యాఖ్యానించారు. చంద్రబాబు హయాంలో బీసీల కోసం ప్రవేశపెట్టిన ఎన్నో రకాల పథకాలను రద్దు చేసిన బీసీల ద్రోహి జగన్ అని విమర్శించారు. జగన్ పాలనపై బీసీలు తిరుగుబాటు చేసే రోజు దగ్గరలో ఉందన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తుందని, ఈ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారన్నారు. సదస్సుకు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చల్లా శ్రీనివాసరావు, కంచర్ల శివప్రసాద్, తాడిబోయిన గోపి, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుకు నీరు ఇవ్వకపోతే ఆందోళన చేస్తాం

● అధికారులకు అల్టిమేటం జారీ చేసిన వైసీపీ నేతలు

ప్రత్తిపాడు, మార్చి 4: ప్రత్తిపాడు రక్షిత మంచినీటి చెరువుకు నాగార్జున సాగర్ నీరు ఇవ్వకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని అధికారులకు ప్రత్తిపాడు అధికార వైసీపీ నాయకులు అల్టిమేటం జారీ చేశారు. ప్రత్తిపాడు వచ్చిన ఆర్డీవో శ్రీకర్‌కు ప్రత్తిపాడులో తాగునీటి పరిస్థితిని వివరించారు. అనంతరం ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు శివారెడ్డితో పాటు స్థానిక వైసీపీ నాయకులు స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 25వేలు జనాభా ఉన్న ప్రత్తిపాడుకు నీరు రావడం కష్టమైన విషయమన్నారు. ఇటీవల తుపాను రావడం వల్ల చెరువులోనికి నీరు వచ్చాయని లేకపోతే గ్రామం మొత్తం ఇబ్బంది పడాల్సి వచ్చేదన్నారు. చెరువుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన నీరు ప్రత్తిపాడు చెరువుకు రావాలని లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆయన ఉద్యోగం చేయడా

ఇరిగేషన్ ఏఈ స్పందనకు రాకపోవడంపై తహసీల్దార్ రాఘవేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్క్ఇన్‌స్పెక్టర్ హాజరుకావడం, ఆయనే వాటర్ సమస్యపై సమాధానం చెపుతుండటంతో.. ఆయన ఉద్యోగం చేయడా అంటూ ప్రశ్నించాడు. వర్క్ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో చెపుతారంటూ సమాధానం ఇచ్చారు.

గుండిమెడలో కేఎల్ న్యాయకళాశాల విద్యార్థుల సర్వే

తాడేపల్లి, మార్చి 4: తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో కేఎల్ న్యాయకళాశాల విద్యార్థులు సోమవారం న్యాయ సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రామంలో పలువురు వృద్ధులు పెన్షన్ల పంపిణీలో ఎదురవుతున్న ఆటంకాలు, ఆర్టీసీ బస్సుల అసౌకర్యం, విద్యుత్ సరఫరా సమస్యలు, పలువురు భార్యాభర్తల వివాదాల వంటి పలు సమస్యలను విద్యార్థుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కేఎల్ న్యాయకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు న్యాయసేవలు అందించేందుకు కేఎల్ న్యాయకళాశాల విద్యార్థులు 180 మంది సర్వే నిర్వహించారన్నారు. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

జగన్‌రెడ్డి తిరిగి రాజధాని అడుగుపెట్టకూడదు

● కులమతాలతో మనుషులను విడగొట్టాలనుకోవడం జగన్ భ్రమే

● టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



తుళ్లూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్

తుళ్లూరు, మార్చి 4: వచ్చే ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పుతో సీఎం జగన్‌రెడ్డి తిరిగి రాజధానిలో అడుగుపెట్టకూడదని టీడీపీ జిల్లా నేత పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న సీఎం జగన్‌రెడ్డి మెడ నుంచి మొండెం వరకు అన్ని వెనక్కి తిప్పాడని టీడీపీ ఆయన అన్నారు. సోమవారం తుళ్లూరు టీడీపీ కార్యాలయం ప్రారంభానికి వచ్చిన సందర్భంలో పార్టీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో పెమ్మసాని, తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్‌లు పాల్గొన్నారు. అనంతరం నవయుగ కంపెనీ స్థలంలో ఏర్పాటు చేసిన సభలో పెమ్మసాని మాట్లాడారు. అమరావతి రైతులను, మహిళలను సీఎం జగన్‌రెడ్డి చిత్ర హింసలకు గురిచేశాడన్నారు. ఇంట్లో ఎలుకున్నాయని ఇళ్లు తగలబెట్టుకోకూడదు. మనమందరం కలసి రాష్ట్ర భవిష్య త్తు కోసం పని చేయాలని కోరారు. భూమిలిచ్చిన రైతులను జగన్‌రెడ్డి నానా ఇబ్బందులకు గురిచేశాడన్నారు. గొప్ప రాజధానిగా అభివృద్ధి చేయాల్సింది పోయి నిర్వీర్యం చేశాడన్నారు. రోడ్లు వేస్తే తవ్వుకుపోయారన్నారు. రైతులను భూమిలిచ్చినందుకు లాఠీ దెబ్బలు, అక్రమ కేసులు, కటకటాలు పాలు జేశారన్నారు. ప్రజలు టీడీపీ జనసేనకు అద్భుతమైన మెజార్టీ ఇవ్వాల్సి ఉందన్నారు. అప్పుడే సీఎం జగన్‌రెడ్డి నాశనం చేసిన రాష్ట్రాన్ని సరిదిద్దగలమన్నారు. కుల మతాలుగా మనుషులను విడగొట్టాల ని సీఎం జగన్‌రెడ్డి చూస్తున్నాడన్నారు. అది భ్రమే అవుతుందన్నారు. అమరావతి, గుంటూరు ప్రజలకు శక్తి వంచన లేకుండా సేవ చేస్తానని పెమ్మసాని అన్నారు. తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అమరావతి పేదల ఫించన్ టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పెంచి ఇస్తామని గతంలోనూ చెప్పాము.. ఇప్పుడు చెపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జన సేన కార్యకర్తలు నాయకులు, టీడీపీ అభిమానులు, బాలకృష్ణ, పవన్ కల్యాణ్ అభిమానులు వందలాది మంది పాల్గొన్నారు.

300 కుటుంబాలు టీడీపీలో చేరిక

తాళ్ళాయపాలెం మండడం గ్రామాలకు చెందిన 300 కుటుంబాల వారు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. సోమవారం తుళ్లూరు టీడీపీ కార్యాలయం ప్రారంభించడానికి వచ్చిన పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్‌లు సభలో వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అంతక ముందు రెండు గ్రామాల నుంచి వైసీపీ నేతలు కండపాటి సతీష్ చంద్ర(బుజ్జి) బెజవాడ రమేష్ ఆధ్వర్యంలో వైసీపీ నుండి టీడీపీలోకి చేరే వారు భారీ బైకు ర్యాలీతో తుళ్లూరుకు వచ్చి పార్టీలో చేరారు.

రాజధానిలో అపూర్వ స్వాగతం

పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్ కుమార్‌లు తుళ్లూరులో సోమవారం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు బైకు ర్యాలీ నిర్వహించారు. మేళ తాళాలు, కనక తప్పె ట్లు బాణసంచాతో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రాజధాని మహిళలు ర్యాలీలో పూలు జల్లి పెమ్మసానికి షేక్ హ్యాండ్‌లిచ్చారు. పెమ్మసాని రాకతో టీడీపీకి పూర్వవైభవం వచ్చిందని పలువురు సీనియర్ నాయకులు, క్రియా శీలక కార్యకర్తలు, పార్టీ అభిమాలు ఆనందం వ్యక్తం చేశారు.

చిరువ్యాపారులకు టిఫిన్, తోపుడు బండ్లు

మంగళగిరి సిటీ, మార్చి 4: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మక్కపాటి ప్రభాస్ సంయుక్త సహకారంతో 22 మంది చిరు వ్యాపారులకు టిఫిన్, తోపుడు బండ్లు అందజేశారు. టిడ్కో గృహ సముదాయంలో సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దామర్ల నాగేంద్రం, జంజనం నాగరాజు, సూరేపల్లి జోజి, తుమ్మా విజయ, కాశిన దేవి, షేక్ కరీమున్నిసా, యిష్టంశెట్టి అన్నపూర్ణ, అవ్వారు కోటేశ్వరమ్మ, ఇండ్ల రజని, సయ్యద్ ఖాజా, ఉప్పలపాటి మల్లేశ్వరిలకు టిఫిన్ బండ్లు, పల్లపు లలిత, గోలి ఏడుకొండలు, షేక్ ఖాశింబీ, పోగుల శివదుర్గ నాగలక్ష్మీ, సయ్యద్ రంజానీ, నట్టవ రమాదేవి, ముద్రబోయిన సతీష్, తానికొండ శివకుమారి, కుందేళ్ల శేషారత్నం, పంపన లక్ష్మీ, దివి పిచ్చియ్యలకు తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ సహకారంతో కుట్టుమిషన్ల పంపిణీ



శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న భూలక్ష్మి, జానకీదేవి తదితరులు

మంగళగిరి సిటీ, మార్చి 4: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో అమలు చేస్తున్న స్త్రీ శక్తి 53వ బ్యాచ్‌లో మంగళగిరి పట్టణం, మండలానికి చెందిన 90 మంది మహిళలు రెండు నెలల పాటు కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్నారు. వీరికి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో సోమవారం ఉచితంగా కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. తమ జీవనోపాధికి సహకారం అందించిన లోకేశ్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో మహిళలంతా లోకేశ్‌కు అండగా ఉండి భారీ ఆధిక్యంతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, తెలుగు మహిళలు మంచికలపూడి వైష్ణవి, యర్రంశెట్టి సునీత, వాసా పద్మ, అప్పల శాంతి, మోతుకూరి సుజాత, గడ్డిపాటి తులసీ, ఓదూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అదనంగా మూడు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో శ్రీకర్

ప్రత్తిపాడు, మార్చి 4: నియోజకవర్గంలో అదనంగా మూడు పోలింగ్ బూత్‌లను కేటాయిస్తున్నట్టు ప్రత్తిపాడు ఈఆర్‌వో శ్రీకర్ తెలిపారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఆర్‌వో శ్రీకర్ నూతనంగా ఏర్పాటు చేస్తున్న మూడు పోలింగ్ బూత్‌ల వివరాలను రాజకీయ పార్టీ నాయకుల ఆమోదం కోసం తెలియజేశారు. అంతేకాకుండా 15 పోలింగ్ బూత్‌ల బిల్డింగ్ పేర్లు కూడా మార్పు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 85 సంవత్సరాలు పై బడిన వారికి మాత్రమే ఇంటి వద్ద ఓటింగ్‌కు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి మండలంలో మోడల్ పోలింగ్ బూత్‌తో పాటు ఒక మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న చోట ఉమెన్ మోడల్ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు మండలంలో ఇంకా చనిపోయిన వారి ఓట్లు ఉన్నట్లు మండల పార్టీ అధ్యక్షులు గింజుపల్లి శివరామప్రసాద్ తెలిపారు. ఆ ఓట్లను సుమోటోగా తీసుకోవడానికి అవకాశం లేదని, అర్జీలు పెడితే పరిశీలించి తొలగించడం జరుగుతుందన్నారు.

నివేశనస్థలాల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

దుగ్గిరాల, మార్చి 4: మండలంలో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లపట్టాలను సోమవారం అందించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన సోమవారం జరిగిన కార్యక్రమంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు ఇళ్లపట్టాలను అందించారు. మొత్తం 3వేల మందికి అందించిన పట్టాల పంపిణీలో జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, యార్డు చైర్మన్ షేక్ బాజి, సర్పంచ్ మేఘావత్ కుషీబాయి, ఎంపీటీసీలు, తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

పెదనందిపాడు, మార్చి 4 : ఆటో డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక గుంటూరు-పర్చూరు రహదారిలోని పోలీస్ చెక్ పోస్ట్ వద్ద సోమవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న ఆటో డ్రైవర్లకు, కూలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి కూలీలను ఎక్కించరాదని, లౌడ్‌స్పీకర్లు పెట్టరాదని, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. కూలీలు కూడా పరిమితికి మించి ఎక్కరాదని, దీంతో తమ ప్రాణాలకే ముప్పు ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు.

భృంగి వాహనంపై దేవదేవుడు



భృంగి వాహనంపై దర్శనమిచ్చిన మల్లేశ్వరస్వామి

మంగళగిరి సిటీ, మార్చి 4: మంగళగిరి గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారికి భృంగి వాహన సేవ నిర్వహించారు. శివాలయం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు సాగింది. ఉత్సవానికి లూన్ కరణ్‌శర్మ, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ కుటుంబసభ్యులు కైంకర్యపరులుగా వ్యవహరించారు.

అన్యాక్రాంతమైన ఏసీసీ భూములను కాపాడాలి

తాడేపల్లి టౌన్, మార్చి 4: ఏసీసీ సిమెంటు కంపెనీకి చెందిన భూములను అన్యాయంగా అమ్మకాలు సాగిస్తున్న బయటి వ్యక్తులు, ఇతరులపై చర్యలు తీసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిన వారిని గుర్తించి భూములను కాపాడాలని ఏసీసీ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ఏసీసీ భూములను, వాటిలో వేసిన హద్దురాళ్లను నేతలు పరిశీలించారు. కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపాలన్నారు. ఏసీసీ భూములను పరిశీలించిన వారిలో కార్మిక నేతలు కూరపాటి స్టీవెన్, కొర్రపాటి ఆదినారాయణ, యెహోషువ, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, చిట్టి, బెనర్జీ తదితరులున్నారు.

శ్మశానవాటిక కేటాయించకుంటే ఎన్నికల బహిష్కరణ

● అనంతవరప్పాడు ఎస్సీ కాలనీ జాయింట్ యాక్షన్ కమిటి

వట్టిచెరుకూరు, మార్చి 4: మండలం పరిధి అనంతవరప్పాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో దశాబ్దాలుగా శ్మశాన వాటిక ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రగతిశీల కార్మిక సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి అన్నారు. సోమవారం ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో బి.కొండారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వతీరును నిరసిస్తూ రానున్న ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ ప్రగతిశీల కార్మిక సమైఖ్య కార్యదర్శి ఎన్ పోతురాజుల రాజశేఖర్, శ్మశాన వాటికి సాధన జేఏసీ కన్వీనర్ పి.సత్య రాజులతో పాటు 20మంది కమిటీగా ఏర్పడి ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలిపారు.

టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయం

● ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బి.రామాంజనేయులు

వట్టిచెరుకూరు, మార్చి 4: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని విస్మరించిన జగన్ ప్రతిపక్షాలపై కక్ష, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టడమే కాకుండా దేవాలయం లాంటి రాష్ట్ర సచివాలయన్నే తాకట్టు పెట్టాడంటే ఎంత దుర్మార్గుడో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బి.రామాంజనేయుల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండలం పరిధి పల్లపాడులో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీతో పాటు పరిచయ కార్యక్రమం గ్రామ సర్పంచ్ జాగర్లమూడి వెంకాయమ్మ, ఎంపీటీసీ కొర్రపాటి అహల్య, క్లస్టర్లు జాగర్లమూడి రంగారావు, మర్రి సాంబశివరావుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమానికి బి.రామాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత గ్రామంలోని వడ్డెరకాలనీ పుల్లపు నాగేశ్వరరావు, స్థానిక యువకులు నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు మన్నవ పూర్ణచంద్రరావు, జనసేన మండల అధ్యక్షులు పత్తిభావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు చలపతి ఫార్మసీలో ఫార్మ అన్వేషణ్-2024

తాడికొండ, మార్చి 4: లాం చలపతి ఫార్మసీ కళాశాలలో మార్చి 6వ తేదీన ఫార్మా అన్వేషన్-2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం కళాశాలలో ఫార్మ అన్వేషన్-2024 పోస్టర్‌ను చెన్నై సీఎల్ బైద్ మేత కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ గురుప్రసాద్ మొహంత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పిలుపుతో భారతదేశ ఫార్మసీ పితామహులు ప్రొఫెసర్ మహదేవలాల్ ష్రాఫ్ జయంతిని పురస్కరించుకొని ఫార్మ అన్వేషణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పరిశ్రమల నుంచి పారిశ్రామికవేత్తలు, ఫార్మ నిపుణులు, కళాశాల పూర్వ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలపతి కళాశాలకు, అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న చలపతి కళాశాల సెక్రటరి, అధ్యాపకులు

తాడికొండ, మార్చి 4: మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు, అధ్యాపకులు పలు అవార్డులను సాధించినట్లు కళాశాల సెక్రటరి వై సుజిత్‌కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఏఐఎంఐఆర్ సొసైటీ ఆధ్వర్యంలో సీఎంఆర్ కళాశాలలో ఉత్తమ కళాశాలలు, అధ్యాపకులు ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకమైన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో చలపతి కళాశాలకు కమ్యూనిటి అవుట్ రిచ్ అవార్డు దక్కిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డును సాధించినట్లు తెలిపారు. డీఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.సాయిశ్రీనివాస్‌కు రైజింగ్ స్టార్ ఎడ్యుకేటర్ అవార్డును సొంతం చేసుకున్నారన్నారు. కృత్రిమ మేధా విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్ శాంతిప్రియ కమ్యూనిటి ఎంగేజ్‌మెంట్ అండ్ సోషల్ ఇంపాక్ట్ అవార్డు పొందారన్నారు. అధ్యాపకులు, కళాశాలకు అవార్డులు రావటంతో కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు అభినందించారు.

జనసేన కోసమే కాపు సంక్షేమ సేన ఏర్పాటు

మంగళగిరి సిటీ, మార్చి 4: జనసేన పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకే మంగళగిరి కాపు సంక్షేమ సేన ఏర్పాటైందని నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాపరౌతు సుందరయ్య తెలిపారు. మంగళగిరి ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సుందరయ్య మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు హరిరామ జోగయ్య జనసేన పార్టీ బలోపేతం కావాలని ఉద్దేశంతో పవన్ కల్యాణ్‌కు లేఖలు రాశారని చెప్పారు. జనసేన పార్టీకి, కాపు సంక్షేమ సంఘానికి ఎలాంటి విభేదాలు లేవన్నారు. అందరం ఐక్యంగా ఉండి జనసేన పార్టీకి కేటాయించిన సీట్లను గెలిపించేందుకు కాపు సంక్షేమ సేన సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు తిరుమలశెట్టి కొండలరావు నియోజకవర్గంలోని కాపు వర్గీయులందరూ లోకేశ్‌కు మద్దతిచ్చి గెలిపించాలని పిలుపునిచ్చారు.

పనులు వేగవంతం చేయాలి

● డీఎల్పీవో లక్ష్మణరావు

పెదనందిపాడు, మార్చి 4: ఇంటి, నీటి పన్ను వసూళ్ళు వేగవంతం చేయాల్సిన డీఎల్పీవో లక్ష్మణరావు అన్నారు. స్థానిక గ్రామసచివాలయాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. డివిజన్ పరిధిలో రూ.16 కోట్లు బకాయిలు ఉండగా ఇప్పటికీ 40శాతం మాత్రమే పన్ను వసూళ్ళు చేశారని, మిగిలిన శాతం కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



వంగిపురంలో పోలీసు కవాతులో పాల్గొన్న సీఐ నిస్సార్ బాషా, ఎస్ఐ సోమేశ్వరరావు

ప్రత్తిపాడు, మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్తిపాడు మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన వంగిపురం, పాతమల్లాయపాలెం, తిమ్మాపురం గ్రామాల్లో సోమవారం పోలీసు కవాతు నిర్వహించారు. ప్రత్తిపాడు సీఐ నిస్సార్ బాషా, ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావుల ఆధ్వర్యంలో సీఏపీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు.

తాడేపల్లి, మార్చి 4: తాడేపల్లి మండలం ప్రాతూరు, గుండిమెడ గ్రామాల్లో పోలీసు సిబ్బంది సోమవారం కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యలుగా ప్రజలను అప్రమత్తం చేస్తూ పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. తాడేపల్లి సీఐ మధుసూదనరావు, ఎస్ఐ ప్రతాప్‌కుమార్, రమేష్, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉండవల్లిలో టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం



ఉండవల్లిలో టీడీపీ జనసేన ఆత్మీయ సమావేశం దృశ్యం

తాడేపల్లి, మార్చి 4: తాడేపల్లి మండలం ఉండవల్లిలో తెలుగుదేశం జనసేన పార్టీల నేతలు సోమవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇరు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు భారీగా హాజరై రానున్న ఎన్నికల్లో సమిష్టిగా అభ్యర్థుల విజయానికి చేయాల్సిన కృషి, ప్రజలతో మమేకమవ్వాల్సిన అంశాలపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎన్నికల సమయంలో ఇరు పార్టీల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, బొర్రా కృష్ణవందన, లింగంశెట్టి కృష్ణకిషోర్, దాసరి కృష్ణ, దొప్పలపూడి జ్యోతిబసు, రాయపూడి కిరణ్, జనసేన మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, చవ్వాకుల కోటేష్‌బాబు, ఎస్ రాజారమేష్, పలువురు నేతలు, కార్యకర్త లు పాల్గొన్నారు. కాగా ఆదివారం రాత్రి తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితర నేతలతో జనసేన పట్టణ నాయకులు ఎస్ వెంకట్, తదితరులు భేటీ అయ్యారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జడ్పీటీసీ గుల్జార్‌బేగం

కాకుమాను, మార్చి 4: ఈ నెలలో పది విద్యార్థులకు జరిగే పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం అన్నారు.మండల కేంద్రమైన కాకుమానులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది చదివే విద్యార్థులకు సోమవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. పది విద్యార్థులు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆందోళన లేని జీవితాన్ని ప్రాథమిక స్థాయి నుంచే అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పెదరావూరులో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ,సీఆర్‌పీఎఫ్ బలగాలు

ప్రజలు ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

● డీఎస్పీ రమేష్

తెనాలి రూరల్, మార్చి 4: రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎటువంటి ప్రలోభాలకు గురికావద్దని తెనాలి డీఎస్పీ రమేష్ చెప్పారు. సోమవారం మండలంలోని సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పెదరావూరు, అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రధాన భూమిక అన్నారు. ఓటరు తనకు మంచిచేసే ఏ అభ్యర్థినైనా తాను స్వతంత్ర్యంగా ఎన్నుకునే హక్కు ఉందన్నారు. ఆ హక్కుకు బంగం కలిగించేలా ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా బెదిరింపులకు, లేదా ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులు రక్షణగా నిలుస్తామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా గ్రామాన్ని తాము ఆధీనంలోకి తీసుకున్నామని ఎలక్షన్ ప్రక్రియను సజావుగా సాగేలా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు సహకరించాలన్నారు. రూరల్ సీఐ వెంకటేశర్లు, ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు మండలంలో...

చేబ్రోలు, మార్చి 4: గ్రామాలలో శాంతియుత వాతావరణలో ఎన్నికల నిర్వహణే లక్ష్యమని పొన్నూరు రూరల్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వేజండ్ల, సుద్దపల్లి, శేకూరు, శలపాడు గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ కోటేశ్వరరావు చేబ్రోలు ఎస్ఐ పీ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ ఎస్ఎస్ బలగాలు గ్రామాలలో కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేసేందుకు కృషి చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిలో పేదలకు మంచిచేసింది నేనే..!

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి, మారీసుపేట, మార్చి 4: తెనాలి ప్రాంతంలో గతంలో ఏ ప్రజా ప్రతినిధి చేయనంతగా పేదలకు మంచిచేసింది నేనేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని తాలూకా జూనియర్ కాలేజి ప్రాంగణంలో జనన్న కాలనీలలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గతంలో పనిచేసి మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు తెనాలి ప్రాంతంలో పేదలకు ఇచ్చిన నివేసన స్థలాలతో పోల్చుకుంటే తాను ఎమ్మెల్యేగా అంతకు మిన్నగా ఇళ్ల స్థలాలు అందులో ఇళ్లు కట్టుకునేందుకు అండగా నిలిచానన్నారు. తను కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి పేదవారికి సంక్షేమ పథకాల లబ్ధిని చేరువచేసి ఆ కుటుంబాలకు అండగా నిలిచానన్నారు. ప్రజలందరూ వీటన్నింటినీ గమనించి మంచి చేశావయ్య అంటూ తనపై ఈ ప్రాంత ప్రజలు ప్రేమచూపుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మంచిచేసిన తననే తిరిగి గెలిపించుకునేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధికా రమేష్, వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మునిసిపల్ కమిషనర్ శేషన్న, పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆహారం పంపిణీ



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

తెనాలి, మారీసుపేట మార్చి 4: పట్టణంలో పేదప్రజల కోసం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ లలో ఆహారం పంపిణీ చేశారని టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు సోమవరపు సాంబశివరావు అన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజి చౌక్‌లో అన్న క్యాంటీన్‌లలో సోమవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్రొత్తపల్లి రమేష్, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరరావు, వెల్లంకి సాంబయ్య, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న సాధిక్

సామాజిక సేవకుడు సాధిక్‌కు అవార్డు

తెనాలి అర్బన్, మార్చి 4: తెనాలికి చెందిన సామాజిక సేవకుడు షేక్ సాధిక్‌కు నంది అవార్డు లభించింది. ఆయన సేవలను గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన మెగా ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఈ అవార్డు అందజేసింది. యంగ్ జనరేషన్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పట్టణంలో 900లకు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించి సుమారు 40వేల మందికి సాయం అందించాడు. ఆయన సేవలను గుర్తించిన సంస్థ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును బలగం సినిమా ఫేమ్ సంజయ్‌గౌడ్ అందజేశారు. అవార్డు అందుకున్న సాధిక్‌ను పలువురు అభినందించారు.

దళితులు ఎంతకాలం కుర్చీలు మోస్తారు

● సినీ దర్శకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్, మార్చి 4: దళితులు ఎంత కాలం కుర్చీలు మోస్తారని, ఈ ఎన్నికల్లో సత్తా చూపేందుకు సిద్ధం కావాలని సినీ దర్శకుడు దిలీప్‌రాజా పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లోని తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయ పార్టీలు ఎస్సి, బీసీ, మైనారిటీలను సీఎం చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఎస్టీని రాష్ట్రపతి చేసిందని అభినందించారు. తెలంగాణలో ఎస్సీలను సీఎం చేస్తామని చెప్పిన కేసీఆర్ గెలిచాక మాట మరిచి తరువాత ఎన్నికల్లో ఏమయ్యారో తెలుసుకోవాలన్నారు. పల్లకిమోసే స్థాయి నుంచి పల్లకి ఎక్కే స్థాయికి ఎదగడానికి దళితులకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు దళితులు సన్నద్ధం కావాలన్నారు.

బీసీలకు గుర్తింపునిచ్చింది తెలుగుదేశం పార్టీనే

● మంగళగిరిలో జరిగే సభను జయప్రదం చేద్దాం ● పార్టీ నేతలతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 4: బీసీలకు తగిన గుర్తింపునిచ్చింది తెలుగుదేశం పార్టీ అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ బీసీ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ రేపు మంగళగిరి సమీపంలో టీడీపీ, జనసేన ఉమ్మడిగా జయహో బీసీ పేరుతో నిర్వహిస్తున్న బీసీ డిక్లరేషన్ సభకు పార్టీ శ్రేణులు, బీసీ కమ్యూనిటీ సోదర, సోదరీమనులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎన్నో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ గత ఐదేళ్లుగా బీసీల అభ్యున్నతికి కృషి చేసిందిలేదని పైగా దాడుల సంస్కృతికి తెరలేపారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో బీసీల సంక్షేమానికి అనేక విధాలుగా కృషిచేసిందని వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటిని నిలుపుదల చేసి వారిని అణిచివేసేలా కుట్రపూరిత రాజకీయాలకు తెరలేపిందని విమర్శించారు. బీసీలకు వెన్నుదన్నుగా ఉండే తెలుగుదేశం పార్టీని రానున్న ఎన్నికల్లో అధికారంలోకి తీసుకురావలని కోరారు.

మంగళవారం జరిగే సభకు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హాజరవుతారని ఆయన ఉమ్మడి మినీ మేనిఫెస్టోలో బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి వారిపై ఉన్న అభిమానాన్ని చాటారన్నారు. సభకు పెద్దఎత్తున హాజరై తమ మద్దతు తెలపాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డెయిరీ రంగంలో విప్లవాత్మక మార్పులు: ధూళిపాళ్ల



తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, మార్చి 4: డెయిరీరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన 50వ ఇండియన్ డెయిరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో సంగం డెయిరీ ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారు. కాన్ఫరెన్స్‌ను తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ కాన్ఫరెన్స్ వేదిక వద్ద ఏర్పాటుచేసిన సంగం డెయిరీ స్టాల్స్‌ను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ధూళిపాళ్ల వీరయ్య చౌదరి తమకు రాజకీయ గురువు అన్నారు. ఆయన నేతృత్వంలో పురుడు పోసుకున్న సంగం డెయిరీ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో దక్షిణభారతదేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయం అన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్ఫరెన్స్‌లో ప్రపంచ దేశాల్లో అందుబాటులో ఉన్న డెయిరీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్థానిక డెయిరీ నిర్వాహకులు అధ్యయనం చేసి అందిపుచ్చుకోవాలని సూచించారు. ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత దశాబ్దకాలంగా డెయిరీ రంగంలో విప్లవాత్మక, సాంకేతిక మార్పులు వచ్చాయన్నారు. డెయిరీ ఇప్పటికే ప్లాంట్ ఆధునికీకరణ చేపట్టి ప్లాంట్‌ను ఆటోమేషన్ విధానంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాంకేతికతను అందిపుచ్చుకుని సంగం డెయిరీలో అధునాతన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డీడీబీ అధికారులు, సంగం పాలకవర్గ సభ్యులు, తదితర విభాగాల అధికారులు, దేశంలోని పలు డెయిరీల నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీసులు ముందస్తు అరెస్టు చేసుంటే హత్య జరిగేది కాదు

● ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్



సాంబశివరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

కొల్లిపర, మార్చి 4: మృతుడు నాలాది సాంబశివరావు ఎస్సీ, ఎస్టీ కేసున మోదు చేసినప్పుడు నిందితులను ముందస్తుగా అరెస్టు చేసి ఉంటే ఈ హత్య జరిగేది కాదని ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తూములూరులో ఇటీవల హత్యకు గురైన సాంబశివరావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ పోలీసులు పేదప్రజలకు అండగా నిలబడాలేగాని వివక్ష చూపకూడదన్నారు. మాల, మాదిగలపై దాడులు చేయడం దారుణంగా ఉందన్నారు. సాంబశివరావు కుటుంబ సభ్యులకు రూ.4లక్షల 12వేలు తక్షణమే ఇవ్వాల్సి ఉందన్నారు. 5 ఎకరాలు పొలంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్పీ రమేష్, సీఐ సుధాకర్, ఎస్ఐ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, సీఐ రమేష్‌బాబు తదితరులు

తెనాలి, మారీసుపేట మార్చి 4: అక్రమ మార్గంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో ముఠాగా ఏర్పడి గంజాయిని ప్యాకెట్లలో నింపి తెనాలి, పరిసర ప్రాంతాల్లో విక్రయించే ముఠాను తెనాలి త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ రమేష్ తెలిపారు. సోమవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రమేష్ నిందితులను చూపుతూ కేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక త్రీటౌన్ పరిధిలోని చంద్రబాబు కాలనీ నుంచి పరిమిపోయే డొంక రోడ్డులో కల్లు పాకల వద్ద సాయత్రం కొందరు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నారని అందిన సమాచారంతో సీఐ రమేష్‌బాబు తన సిబ్బందితో దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిలో ఒకరు పారిపోగా, నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాటుపడిన మండల పరిధిలోని సంగంజాగర్లమూడికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రషీద్, నందులపేటకు చెందిన కోటి సాయి మంజునాద్, నందులపేటకు చెందిన దేవరకొండ మను శివశంకర్, బీసీ కాలనీకి చెందిన కోట సురేంద్రలు ఒక ముఠాగా ఏర్పడి నర్సీపట్నం ఏరియా నుంచి 1.2 కేజీల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలికి తీసుకువచ్చారు. వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి తెనాలి, పరిసర ప్రాంతాల్లో అమ్మకాలు జరిపారని తెలిపారు. వీరివద్ద నుంచి సుమారు రూ.1 లక్ష విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డీఎస్పీ హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా చూడాలని కోరారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ పరమేశ్వరావు, ఏఎస్సై షేక్ హైదర్ అలీ, పీసీస్ పి.మురళి, ఎం.అంకయ్య, శ్రీహరిని డీఎస్పీ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో పోలీసుల కవాతు

పట్టణంలో సోమవారం పోలీసులు కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో గుంటూరు ఎస్పీ ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు, ఎస్సై పరమేశ్వరావు వారి సిబ్బంది, సెంట్రల్ బలగాలతో కలసి పట్టణంలో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని డీఎస్పీ పిలుపునిచ్చారు. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రజలు, అన్ని పార్టీల వారు సహకరించాలని కోరారు.



వెంకట్, అస్మతున్నీసాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు సన్మానం

తెనాలి అర్బన్, మార్చి 4: ఐతానగర్ మున్సిపల్ హైస్కూల్‌లో పని చేస్తున్న చిత్రలేఖనం ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్, తెలుగు ఉపాధ్యాయిని అస్మతున్నీసాలను సోమవారం సత్కరించారు. చిత్రలేఖనం, ఎన్‌సీసీ, రంగస్థల కళారంగాలలో వెంకట్ సేవలందిస్తున్నారు. పలు రచనలతో అస్మతున్నీసా సమాజాన్ని మేలుకొల్పుతున్నారు. వారి సేవలను గుర్తించిన అంతర్జాతీయ సేవా సంస్థ గుర్రం జాషువా కళాపరిషత్, తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా సన్మానించారు. సంస్థ గుర్తింపుపొందిన ఇద్దరిని పాఠశాలలో కూడా సత్కరించి తెనాలి ప్రతిష్ఠను పెంచారని అభినందించారు. కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, కమిటీ ఛైర్మన్ రాజు, హెచ్‌ఎం రాజకిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గుంటూరు-1 డిపో సూపర్‌వైజర్ సస్పెన్షన్

● గ్యారేజ్ నిధుల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారుల చర్యలు

గుంటూరు, మార్చి 4: ఆర్టీసీ గుంటూరు-1 డిపో గ్యారేజ్‌లో నిధులు గోల్‌మాల్ చేసిన వ్యవహారంపై ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. విచారణ తరువాత బాధ్యుడైన సూపర్‌వైజర్ జయరావును సస్పెండ్ చేస్తూ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం. రవికాంత్‌ఆదేశాలు జారీ చేశారు. గ్యారేజ్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారం గుట్టును రట్టు చేస్తూ గత నెల 12న 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'ఆర్టీసీ గ్యారేజ్ నిధులు గోల్‌మాల్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. గుంటూరు-1 డిపో గ్యారేజ్‌లో డిపార్ట్‌మెంట్‌కు చెందిన నిధులు సూపర్‌వైజర్ ఏకంగా రూ. 1లక్షా 80వేలు దారి మళ్లించారు. సాధారణంగా డిపోకు చెందిన గ్యారేజ్‌లో బస్సులకు ఆటోమొబైల్ పరికరాలకు సంబంధించి ఆ శాఖ నిధులు మంజూరు చేస్తుంది. సూపర్‌వైజర్ ఆయా నిధులతో కొనుగోలు చేస్తూ పక్కా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలానే ఇక్కడ డిపోలో మంజూరుచేసిన నిధులను సూపర్‌వైజర్ తన సొంత అవసరాలకు పక్కదారి పట్టించినట్లు తేలింది. ఆటో మొబైల్ విక్రయించిన సదరు సంస్థలు తమకు బకాయిలు చెల్లించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్ళటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సదరు సూపర్‌వైజర్ నిధులు సొంతానికి వాడుకున్నట్లు సమాచారం రావటంతో ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు.

కోల్డ్ స్టోరేజీ ప్రమాద బాధితులను ఆదుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

తెనాలి అర్బన్, మార్చి 4: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ప్రకార్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రమాద ఘటనను విచారిస్తున్న ప్రత్యేక అధికారి సబ్ కలెక్టర్‌కు పూర్వాపరాలు వివరించారు. పసుపు రైతులకు పూర్తి బీమా అందలేదని చెప్పారు. ప్రభుత్వం ఈ సంఘటనలో రైతులకు న్యాయం చేసేందుకు తాత్సారం చేస్తోందని ఆరోపించారు. రైతులు వెల్లడించిన వివరాలనే కాకుండా అదనంగా మరో 30వేల బస్తాల వివరాలు సమర్పించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సరైన పద్ధతిలో ప్రమాద బీమా కట్టకపోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జొన్నా శివశంకరరావు, ములకా శివసాంబిరెడ్డి, వెంకటరామయ్య, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృక్షాలను రక్షించుకుందాం: ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్

తెనాలి రూరల్, మార్చి 4: పెరుగుతున్న కాలుష్యాన్ని తట్టుకుని ఆరోగ్యకరమైన జీవితం గడపాలంటే మొక్కలను నాటడం, వృక్షాలను రక్షించుకోవడమే ఏకైక మార్గమని జేఎంజే మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.అరుణ చెప్పారు. మండలంలోని చావావారిపాలెంలో తెనాలి జేఎంజే మహిళా కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ సర్వీస్ స్కీమ్ అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా విద్యార్థినులు మొక్కలు నాటడం, మురుగు కాలువలు శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులకు మొక్కలు పెంపకం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

వికలాంగుల హక్కులపై పోరాడుతాం

● నీలా జోజిబాబు

పొన్నూరు టౌన్, మార్చి 4: వికలాంగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలా జోజిబాబు అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో చలో అమరావతి ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలా జోజిబాబు మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురవుతున్న వికలాంగులను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఇచ్చే పెన్షన్‌ను రూ.6వేలు చేయాలని కోరారు. రద్దయిన పెన్షన్‌లను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల సాధన కోసం ఈ నెల 9న చలో అమరావతి వికలాంగుల మహా గర్జనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్జనకు వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చిట్టినేని సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జనసేన దివ్యాంగుల జనసైనికులు ఆదిశేష, సీపీఐ ఎంఎల్ కార్యదర్శి కోగంటి రామకృష్ణ, పద్మవాసు, కర్నాటి వెంకటరమణ, పెద్దిబోయిన పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదు వద్ద డ్రైయిన్ నిర్మాణం నిలిపివేయాలి

పొన్నూరు టౌన్, మార్చి 4: పట్టణంలోని జామియా మసీదు వద్ద అవసరం లేకపోయినప్పటికీ నిర్మాణం ప్రారంభించి డ్రైయిన్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ముస్లిం సంఘాలు తహసీల్దార్‌కు విజ్ఞప్తిచేశాయి. పొన్నూరు పట్టణంలోని జామియా మసీదు వద్ద ముందు వెనక వైపు మురుగు కాల్వలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మసీదు పక్కన అవసరం లేకపోయినప్పటికీ డ్రైయిన్ నిర్మాణాన్ని అధికారులు చేపట్టిన్నట్లు చెప్పారు. దీనివలన మసీదుకు వచ్చే భక్తులకు మసీదు దుకాణ సముదాయాలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. డ్రైయిన్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ, ముస్లిం సంఘాల నాయకులు షేక్ బాజీ సాహెబ్, పఠాన్ అహ్మద్‌ఖాన్, కరీముల్ల బాజీ, బాబ్జీ, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, చిన్న బక్షీ, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీ నిరాకరించడంపై నిరసన

పొన్నూరు టౌన్, మార్చి 4: స్పందన కార్యక్రమంలో అర్జీను తిరస్కరించారని పట్టణానికి చెందిన మల్లెంపాటి శ్రీనివాసరావు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద శ్రీనివాసరావు నిరసనకు దిగాడు. పట్టణంలోని ఇందిరాగాంధీ కాంప్లెక్స్‌లో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన దుకాణాల లీజును రద్దు చేయాలని శ్రీనివాసరావు ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో గతంలో దుకాణాన్ని యాభైవేలు అద్దె వసూలు చేస్తుండగా అదే దుకాణాన్ని వేలంలో రూ.25వేలకు నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ అధికారులు కేటాయించినట్లు శ్రీనివాసరావు తెలిపాడు. దీనివలన పొన్నూరు పురపాలక సంఘానికి నష్టం జరుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన దుకాణ లీజును రద్దుచేయాలని ఫిర్యాదు చేయడానికి వస్తే తన ఫిర్యాదును స్వీకరించడానికి మున్సిపల్ అధికారులు తిరస్కరించినట్లు శ్రీనివాసరావు ఆరోపించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని

కొల్లిపర, మార్చి 4: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించాలని డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని అన్నారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి సీసీ శోభారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులలతో పాటు అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తే మార్కెట్‌లో మంచి ధర రావటానికి అవకాశం ఉందని తెలియజేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ అధికారులు మాధవి, సుధ, మోడల్‌మేకర్ వసంత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం ప్రియదర్శిని

7న టీ10 క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు (తూర్పు), మార్చి 4: గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, వెనిగళ్ల, భ్రమరాంభపురం కాలనీ మైదానంలో టీ10 క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ బుధవారం ఉదయం 9గంటలకు అండర్-14, 17 బాలర విభాగంలో టి-10 క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఫొటో, ఆధార్ కార్డుతో హాజరవ్వాలని, ఇతర వివరాలకు, 6304881562, 94901 46113 అనే నెంబర్లును సంప్రదించాలని కోరారు.